## రైల్వే గేటు పడితే చాలు.. తప్పని తిప్పలు !

### -రహదారి ఇరుకు కావటంతో ట్రాఫిక్ రద్దీతో వాహనదారుల ఇక్కట్లు



సత్తెనపల్లి,ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:సత్తెనపల్లిలోని అచ్చంపేట రోడ్డు రైల్వే గేటు వద్ద వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైళ్లు వచ్చే సమయంలో గేటు పడటంతో ఇరువైపులా కి.మీ మేర వాహనాలు నిలిచిపోతున్నాయి. రహదారి ఇరుకుగా ఉండటం, వాహనాల రద్దీ పెరగడంతో ప్రయాణం నరకప్రాయంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

## టిడిపి నేత జాకీర్ మృతికి పలువురి సంతాపం



సత్తెనపల్లి,ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: స్థానిక 25 వ వార్డు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ జాకీర్ ఆకస్మికంగా మృతిచెందారు. జాకీర్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు సయ్యద్ పెద కరిముల్లా తదితరులు జాకీర్ మృతికి సంతాపం తెలిపి ఆయన ఆత్మకు శాంతికలగాలని అల్లాను దువ చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

## వైభవంగా 50వ మాస మాఘ పున్నమి గరుడ వాహనసేవ

సత్తెనపల్లి,ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లోని శ్రీ అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారికి, విశేషంగా మాఘ మాస, ఆదివార , శుద్ధ మాఘ పౌర్ణమి పురస్కరించుకొని శ్రీవారికి స్నపన తిరుమంజనం శోభాయమానంగా జరిగింది. తదుపరి శ్రీ చిత్రకవి శ్యాము ఆచార్య రామానుజ స్వామి గరుడల్వార్ మండపంలో వేంచేసి ఉన్న గరుడల్వార్ మూర్తికి విశేషా పూజ నిర్వహించారు, అంతేకాక జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే గరుడిని దర్శిస్తే సర్వపాపాలు తొలుగుతాయని భక్తకోటికి విశ్వాసం అని వివరించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారికి అత్యంత ఇష్టమైన గరుడ వాహనంపై పట్టణ రైల్వేస్టేషన్ పురవీధులలో దర్శనమిస్తూ భక్తులకు అభయప్రదానం చేశారు. ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గరుడ ముద్ద, తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



## పుస్తక పఠనంతోనే సంపూర్ణ పరిజ్ఞానం

### - 'ఫోన్లు వదలండి... పుస్తకాలు పట్టండి'లో వైద్యులు డాక్టర్ గవిని వెంకట్రావు, డాక్టర్ డిఎ సత్యనారాయణ





సత్తెనపల్లి,ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: పట్టణంలోని వావిలాల పార్కులో అమరావతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఫోన్లు వదలండి... పుస్తకాలు పట్టండి' కార్యక్రమంలో భాగంగా ఓపెన్ బుక్ రీడింగ్ సెక్షన్‌కు ముఖ్యఅతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ చల్ల నాగరాజు రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ అమ్మ పుస్తకం రెండూ ఒకటేనని అమ్మతో ఉండే అనుబంధమే పుస్తకంలోనూ ఉంటుందని పిల్లలకు విలువలు తెలియాలంటే పుస్తక పఠనం అవసరమన్నారు. పుస్తకాలు ఒక వ్యక్తి ఆలోచనలను మాత్రమే కాదని, సమాజ దిశను కూడా మార్చే శక్తి కలవన్ని అన్నారు. డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ పుస్తకాలు ఆలోచన శక్తిని పెంపొందిస్తూ ఒత్తిడిలను తగ్గిస్తూ వ్యక్తిగత వృద్ధికి దోహదపడతాయన్నారు. ఆధునిక ప్రపంచంలో పుస్తకం ప్రాధాన్యత మరింత పెరిగిందన్నారు. వినూత్న సాంకేతిక ఆవిష్కరణలకు మూలాలు పుస్తకాలలోనే ఉన్నాయన్నారు. పుస్తకం తప్ప మరో ప్రత్యామ్నాయం లేని పరిస్థితులు వచ్చినా ఆశ్చర్యం లేదన్నారు. అమ్మతో ఉండే అనుబంధం, నచ్చిన పుస్తకంతో ఉండే అనుబంధం ఎప్పటికీ పాతబడవన్నారు. అమరావతి సేవా సమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు సభ్యులు నాగమల్లేశ్వరరావు,షారోన్ కుమార్,గోపి,బాబు, రంజిత్, సుదర్శన్, ప్రేమ్ కుమార్,పండు, అంకమ్మారావు తదితరులు పాల్గొన్నారు .

## సత్తెనపల్లిలో 6న మెగా జాబ్ మేళా

సత్తెనపల్లి,ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా ను నిర్వహిస్తున్నారు. విద్యా కేంద్రం డిగ్రీ మరియు పీజి కళాశాలలో శుక్రవారం ఉదయం 9 గంటలనుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. జ్యాబ్ మేళా నందు పాల్గొను కంపెనీల సంఖ్య 30కిపైగా ఉంటుందన్నారు.సుమారు 2వేల ఖాళీల సంఖ్య ఉంటుందని నిర్వహకులు తెలిపారు. సంప్రదించవలసిన నెంబర్స్: 8074393466, 7779858789, 9100566581, 7702921219 గా తెలిపారు.

## అంబటి రాంబాబు అరెస్టును ఖండించిన కాపు నాయకులు

సత్తెనపల్లి,ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: మాజీ మంత్రి అంబటి రాంబాబు అరెస్టును కాపు నాయకులు ఖండించారు. ఈ సందర్భంగా కాపు నాయకులు కొవ్వూరు నరసయ్య మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో నాడు వంగవీటి మోహన రంగాను తెలుగుదేశం ప్రభుత్వం హత్య చేసిందని నేడు అంబటి రాంబాబును మట్టుబెట్టటానికి టిడిపి గుండాలు బరితెగించారని దుయ్యబట్టారు. పోలీసులు చూస్తూ ఉండగానే ఆయనపై వారి ఇంటి పై దాడి చేశారని ఆరోపించారు. ఇంకొకసారి కాపులపై దాడి జరిగితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. సమావేశంలో వేపూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానంలో 300 సంవత్సరాల క్రితం నుంచి లడ్డు ప్రసాదంగా ఆచరణలో ఉందని ఆ లడ్డులో జంతువుల కొవ్వు కలిసిందని చంద్రబాబు అబద్ధపు ప్రచారాలను చేశారన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీశారని పేర్కొంటూ సుప్రీంకోర్టు సిబిఐ తో దర్యాప్తు చేయించి లడ్డూలో కల్తీ జరగలేదని తేల్చి చెప్పినందున చంద్రబాబు అబద్ధాలు ప్రజలకు తెలుస్తున్నాయన్నారు.



## కోడెల శివప్రసాదరావు స్టేడియంలో ఆగడాలు

### -జిల్లా కలెక్టర్‌కు 'జనసేన' నేతల వినతి

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : : డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన వసతులను ఏర్పాటు చేయాలని జనసేన నాయకులు కోరారు. నరసరావుపేట నియోజకవర్గ జనసేన నాయకులు, వీరమహిళలు సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జనసేన పార్టీ పట్టణ అధికార ప్రతినిధి షేక్. అద్రుఫ్ మాట్లాడుతూ స్టేడియంలోని గత 20 సంవత్సరాల నుండి దాతల సహకారంతో ఏర్పాటు చేసిన క్రీడా సామాగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని ఆరోపించారు. క్రీడాకారులు ఆడుకునే సమయాలలో అధికారులు మరియు సంబంధిత కోచ్ లు అందుబాటులో ఉండటం లేదన్నారు. స్టేడియం వెలుపల తోపుడుబండ్లతో ఆక్రమించుకోవడంతో దారి లేక పార్కింగ్ లేక ఇబ్బంది, లోపలికి రావడానికి వాకర్లు మరియు క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. స్టేడియంలోని స్విమ్మింగ్ ఫూల్ పూర్తిగా నిరుపయోగంగా మారి మూత పడిందన్నారు. క్రికెట్ కి సంబంధించిన సామాగ్రిని యథాస్థితిలో నిర్మించాలని కోరారు. అనేక సమస్యలతో కుడి ఉన్న స్టేడియంలో విచారించి చర్యలు తీసుకొని, బయోమెట్రిక్ విధానంతో స్టేడియంను నడపాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆర్కే యాదవ్, చెన్నుపల్లి సాంబ, షేక్. బాషా, కృష్ణంశెట్టి ఏడుకొండలు, గురజాల వాసు, తెడ్ల వెంకటేశ్వర్లు, ఆళ్ల శ్రీకాంత్, జడా నాని, పసుపులేటి పార్థసారథి, విష్ణు, వీర మహిళలు జడ శ్రావణి, అంబటి రేణుక, రమాదేవి పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## చంద్రబాబు ఎప్పటికీ మచ్చలేని చంద్రుడే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: పక్కా పథకం, ప్రణాళికతో తన విద్వేష రాజకీయాల్లో భాగంగా, అధికారంలో ఉన్నానన్న పొగరుతో నాడు జగన్... టీడీపీ అధినేత చంద్రబాబు సహా, తనతోపాటు పార్టీ ప్రధాన నాయకులపై మోపిన అభియోగాలు, తప్పుడు కేసులు నిలబడవని నాడే చెప్పామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. కాలగమనంలో జగన్ కపట రాజకీయాలు దూదిపింజల్లా తేలిపోతాయని అప్పుడే ప్రజలకు తెలియచేశామన్నారు. టీడీపీ నిర్మూలనే లక్ష్యంగా వైకాపా ప్రభుత్వం నిరాటకంగా ఐదేళ్లపాటు సాగించిన కక్షసాధింపులు, కుట్రలు నేడు విచారణ సంస్థల సమగ్రదర్యాప్తులో పటాపంచలవుతున్నాయన్నారు. స్కిల్ కేసు విచారణలో భాగంగా నాడు సిట్ చంద్రబాబు పాత్రకు క్లీన్ చిట్ ఇవ్వడాన్ని వైసీపీనేతలు తప్పుపట్టారని, నేడు ఈడీ క్లీన్ చిట్ కు ఏం వక్రభాష్యాలు చెబుతారు.. అంటూ ప్రశ్నించారు. చంద్రబాబు ఎప్పటికీ మచ్చలేని చంద్రుడే అన్నది జగమెరిగిన సత్యమని, సూర్యచంద్రులు గతితప్పరు అన్నది ఎంత నిజమో.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తప్పు చేయరు అన్నది అంతే నిజమని అన్నారు. కేంద్ర తాజా బడ్జెట్లో చంద్రబాబు సంకల్ప సాకారానికి మోదీ తనవంతు సహకారం అందించారని, విజన్ 2047 లక్ష్యసాధనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు, ఆవిష్కరణలకు కార్యరూపమిచ్చేలా తాజా బడ్జెట్ లో ఏపీకి కేటాయింపులు జరిగాయన్నారు. హైస్పీడ్ రైల్ కారిడార్లు, తయారీ రంగాలకు ప్రోత్సాహకాలు, ఎం.ఎస్.ఎం.ఈల బలోపేతానికి సహకారం వంటి నిర్ణయాలతో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఏపీ ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చారని అన్నారు.



## కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు: బాలలత

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: నిరంతర కృషి, పట్టుదలతో సాధన చేస్తే ఏ స్థాయి నుంచైనా గొప్ప శిఖరాలను అధిరోహించవచ్చని మాజీ ఐఏఎస్ అధికారి, ప్రముఖ సిఎస్‌బి ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకురాలు మల్లవరపు బాలలత అన్నారు. సోమవారం చిలకలూరిపేట గాంధీపేటలోని చైతన్య ఎలీట్ పాఠశాల ప్రాంగణంలో, ధనిక్ భారత్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 9వ, 10వ తరగతి విద్యార్థుల కోసం నిర్వహించిన కెరీర్ కౌన్సిలింగ్ అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ఉత్సాహభరితమైన ప్రసంగం చేశారు. బాలలత మాట్లాడుతూ, చిలకలూరిపేట వంటి చిన్న పట్టణం నుండి ఐఏఎస్‌గా ఎంపికై, ప్రస్తుతం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారి ఆధ్వర్యంలో రాష్ట్ర పరిపాలన వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న మైలవరపు కృష్ణ తేజను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ణయించుకుని, దానిని సాధించేందుకు అచంచలమైన పట్టుదలతో, క్రమం తప్పకుండా శ్రమిస్తే విజయం తప్పకుండా తమ సొంతమవుతుందని పేర్కొన్నారు. మార్చిలో రాయనున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో పెట్టుకుని, "రేపే పరీక్ష ఉన్నట్లు" ప్రతి క్షణాన్ని విలువైనదిగా భావించి చదువుపై సంపూర్ణ దృష్టి కేంద్రీకరించాలని విద్యార్థులకు సూచించారు. చైతన్య ఎలీట్ పాఠశాల డైరెక్టర్ ఈ.వి. గిరీష్ బాబు, ధనిక్ భారత్ విద్యా సంస్థల డైరెక్టర్లు కందిమళ్ళ సాంబశివరావు, అజయ్ విక్రమ్ వివిధ పాఠశాలల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.





## ఆస్తిపన్ను వసూళ్లను ముమ్మరం చేసిన రెవెన్యూ అధికారులు



చిలకలూరిపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: పురపాలక సంఘం పరిధిలో మెరుగైన మౌలిక సదుపాయాలు మరియు ప్రజా సేవలను అందించడానికి పన్నుల వసూళ్లు కీలకమైన ఆదాయ వనరుగా నిలుస్తుందని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. సకాలంలో పన్నులు వసూలు చేయాలని చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు ఆదేశాలతో, మున్సిపల్ రెవిన్యూ అధికారులు సచివాలయ అడ్మిన్ సెక్రెటరీలు ఔట్ సోర్సింగ్ సిబ్బంది పట్టణంలో ఆస్తి పన్ను,నీటి పన్ను వసూళ్లను ముమ్మరం చేశారు దాంట్లో భాగంగా సోమవారం నాడు రెవెన్యూ ఇనస్పెక్టర్ షేక్ ఖాదర్ 28,29 స్వర్ణ వార్డు శాఖల పరిధిలో ఆస్తి పన్ను,లక్షరూపాయలు వసూలు చేసి పురపాలక సంఘం ట్రెజరీకి జమ చేయించి రసీదులు అందించిన అడ్మిన్ సెక్రెటరీలు లోకేష్ ,మాధవి, తదితరులు ఉన్నారు

## టిడిపి మండల, టౌన్ స్థాయి కమిటీలకు శిక్షణ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: స్థానిక ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మండల మరియు టౌన్ స్థాయి కమిటీల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, పట్టణ ప్రధాన కార్యదర్శి మధుమాల రవి పాల్గొన్నారు.మాజీ ఎమ్మెల్సీ అశోక్ బాబు , అమరావతి ఉద్యమ నేత ఫరూక్ నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై వీరు కీలక అవగాహన పొందారు. సమద్ ఖాన్, రవి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు, నిబద్ధతకు మారుపేరని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలను ఉన్నత స్థానాల్లోకి తీసుకురావడమే పార్టీ లక్ష్యమని, అన్ని కులాలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే ఏకైక పార్టీ టీడీపీ అని స్పష్టం చేశారు



## రేడియం యూనిఫామ్స్ పంపిణీ



చిలకలూరిపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీలో పనిచేస్తున్న కార్మికులకు రోటరీ డైరెక్టర్ పోట్రు పూర్ణచంద్రరావు సౌజన్యంతో రేడియం యాప్రాన్స్ పంపిణీ చేయడం జరిగింది. నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం సేవలం దిస్తున్న ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల భద్రతను దృష్టిలో ఉంచుకొని, 30 మంది కార్మికులకు రక్షణ నిమిత్తం రేడియం యాప్రాన్స్ అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి ,రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షులు ఉప్పుటూరి ప్రసాద్ ,రోటరీ డైరెక్టర్ పోట్రు పూర్ణచంద్రరావు , కటకం శివరాం ప్రసాద్, గోగినేని నాగేశ్వరావు, గళ్ళ సాంబశివరావు, అడుసుమల్లి మోహన్, చిలుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు జాతి గిత్తల బలప్రదర్శన ..లో యజమానులకు సత్కారం



నాదెండ్ల, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: నాదెండ్ల గ్రామంలో వేంచేసి యున్న శ్రీ నందికుంట విఘ్నేశ్వర స్వామి వారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జరిగే ఒంగోలు జాతి వృషభ రాజముల బండ లాగుడు బల ప్రదర్శన కార్యక్రమంలో భాగంగా ఈరోజు 2 పళ్ళు విభాగానికి పోటీ జరుగుతుందన్నారు. కాగా సోమవారం, ముఖ్య అతిథిగా చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు చేతులమీదగా ప్రారంభించటం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, నాదెండ్ల పి ఏ సీ యస్ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, నాదెండ్ల యస్ ఐ వెంకటేశ్వరరావు మరియు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ విభాగంలో మొత్తం 10 జతలు పాల్గొన్నాయి.

## పేట ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఘన సన్మానం

### పాల్గొన్న టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: స్థానిక ఆర్టీసీ డిపో నూతన మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన యద్దనపూడి వేణుబాబు ని తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘమైన కార్మిక పరిషత్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కంచర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వక కలిసిన నాయకులు టీఎన్టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు డిపో మేనేజర్‌తో మాట్లాడిన ఆయన, కార్మికుల సమస్యలు మరియు డిపో అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు. యూనియన్ నాయకులు మరియు అధికారుల మధ్య సమన్వయం ఉంటేనే ప్రయాణికులకు మెరుగైన సేవలు అందుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. వీరితోపాటు కార్మిక పరిషత్ డిపో కార్యదర్శి అద్దంకి వరప్రసాదరావు అధ్యక్షులు,పావులూరి వెంకటేశ్వరరావు టీఎన్టీయూసీ నియోజకవర్గ కార్యదర్శి, సుబ్బారావు సహాయ కార్యదర్శి, సైదా అహ్మద్ కోశాధికారి,నక్క శ్రీనివాసరావు, ఎన్టీఆర్ రమేష్ బాబు, ఆర్.ఎన్. రావు రాములు నాయక్, గణపవరం సురేష్ బాబు, వెలగాల పోతురాజు ,నూతన మేనేజర్ వేణుబాబు తమను కలవడానికి వచ్చిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, డిపో ప్రగతికి అందరి సహకారం కోరారు.



## 'గ్రామీణ సంస్కృతికి చిహ్నాలైన ఎడ్ల సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ'

చిలకలూరిపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: :నియోజకవర్గ పరిధిలోనీ నాదెండ్ల మండల కేంద్రం నాదెండ్ల గ్రామంలో నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఒంగోలు జాతి వృషభ రాజముల బండ లాగుడు బల ప్రదర్శన పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గ్రంథాలయ చైర్మెన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు లు పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు, ఈ సందర్భంగా గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ సంస్కృతికి చిహ్నాలైన ఎడ్ల సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రైతుల శ్రమకు, ఎడ్ల బలానికి నిదర్శనంగా నిలిచే ఈ పోటీలు గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. సీఐ సుబ్బా నాయుడు మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తి ముఖ్యమని, రైతులు తమ పౌరుషానికి ప్రతీకగా ఈ పోటీలను నిర్వహించుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. పోటీలు శాంతియుతంగా, నిబంధనలకు లోబడి జరగాలని సూచించారు.తదుపరి పోటీల నిర్వాహకులు తొలి రోజు 2 పళ్ళు విభాగానికి పోటీలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో నాదెండ్ల సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, నాదెండ్ల యస్ ఐ వెంకటేశ్వరరావు మరియు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు పాల్గొనటం జరిగింది.తొలి రోజు రెండు పళ్ళ విభాగంలో మొత్తం 10 జతలు పాల్గొన్నాయి.



## కోటి రూపాయలు అంచనా వ్యయంతో కొండవీడు ఉత్సవాలు

### జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

యడ్లపాడు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : కోటి రూపాయల అంచనా కొండవీడు ఉత్సవాలు నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా వెల్లడించారు.సోమవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఫిబ్రవరి 7,8 తేదీల్లో నిర్వహించనున్న కొండవీడు ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కొండవీటి ఉత్సవాలకు సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రూ.75 లక్షలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపిందన్నారు. ఫిబ్రవరి 5 వ తేదీన చిలకలూరిపేట పట్టణంలో 2 కె రన్ ద్వారా కొండవీడు ఉత్సవాలకు సంబంధించిన తొలి అంకానికి అడుగు వేయనున్నామన్నారు.దాదాపు 10,000 మంది విద్యార్థులకు 7,8 తేదీల్లో కొండపై వివిధ రకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందించనున్నామన్నారు. హెలీ రైడ్, ఫుడ్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవాలన్నారు. హెలీ రైడ్ కి ఒక వ్యక్తికి రూ.3,500 ధర నిర్ణయించారు.ఉత్సవాల కోసం ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా అటవీ అధికారి కృష్ణ ప్రియ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.






## 'ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి'



రాజుపాలెం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాలోని జాతీయ రాష్ట్ర రహదారులు పై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు (డ్రైవర్ పిలియన్ రైడర్ ఇద్దరూ) తప్పనిసరిగా మార్క్ కలిగిన హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. . హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడానికి అనుమతి లేదని, హైవేలపైకి రాకుండా ఆపి, అపరాధ రుసుము విధించి వెనక్కి పంపుతామన్నారు.. ఈ నిబంధన కఠినంగా అమలు చేస్తున్నామన్నారు.ప్రజల సహకారం కోరుతూ: ప్రాణ భద్రత కోసం అందరూ హెల్మెట్ ధరించి, రోడ్డు భద్రతకు సహకరించాలని విజ్ఞప్తి చేవారు., ఈమేరకు సోమవారం ఈ రాజుపాలెం గ్రామ శివారు ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద జరిపిన వాహన తనిఖీల్లో హెల్మెట్ లేని వారికి , ఈ చలానా కి బదులుగా 15 హెల్మెట్లు కొనిపించి ఇచ్చారు. సత్తెనపల్లి రూరల్ సర్కిల్ లో గల మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో( నెకరికల్లు, రాజుపాలెం, ముప్పాళ్ల) ఇప్పటి వరకు 130 హెల్మెట్లు అమ్ముడయ్యాయని తెలిపారు.

## ఘనంగా గోసేవ ఉత్సవం

సత్తెనపల్లి టౌన్ ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: వాసవి యువశక్తి ఆధ్వర్యంలో సోమవారం గోశాల నందు గో సేవ ఉత్సవం ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా ముందుగా శివలింగానికి అభిషేకం నిర్వహించి, అనంతరం దాతల చేతుల మీదుగా గోపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. తదుపరి గోవులకు గడ్డి మరియు పలురకాల కూరగాయలతో గోపోషణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ పుణ్యకార్యానికి బొళ్ళ వీర వెంకట పాపారావు చౌదరి మరియు ఈదర ప్రమీల దంపతులు ఆర్థిక సహాయ సహకారాలు అందించారు గోశాల అధ్యక్షులు పెండ్యాల కాశీ మల్లేశ్వరరావు కార్యక్రమ విజయానికి దోహదపడ్డారు. గోసేవా కార్యక్రమాన్ని వాసవి యువశక్తి బాధ్యులు కొల్లిపర నరసింహారావు,జవ్వాజీ సుబ్బారావు,కుకుట్ల రాధాకృష్ణ,కొత్త రామకృష్ణ,లఘుమవరపు రమేష్,బి. శివ రంజిత్ కుమార్,కాకరపర్తి సుబ్రహ్మణ్యం, గ్రంధి మోహన్,చిలకల రాఘవేంద్ర పుల్లారావు,. అనిల్‌తదితరులు సమన్వయంతో నిర్వహించారు.



## వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మినరల్ వాటర్ ప్లాంట్ పునఃప్రారంభం

అచ్చంపేట, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త: అచ్చంపేట మండలంలోని వెల్పూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల త్రాగునీటి అవసరాలను తీర్చేందుకు పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను మరమ్మతులు చేసి మళ్లీ వినియోగంలోకి తీసుకువచ్చారు.

ఈ మినరల్ వాటర్ ప్లాంట్‌ను 1994-95 సంవత్సరంలో ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు సుమారు రూ. 80,000 వ్యయంతో రిపేర్ చేయించి పాఠశాలకు అందించారు. కార్యక్రమానికి 1994-95 ఎస్ఎస్‌సి బ్యాచ్ ప్రతినిధులుగా పొన్నికంటి రజిని, గుంటూరు మురళీకృష్ణ, మోదుగుల వాసు పాల్గొన్నారు. అలాగే పాఠశాల చైర్మన్ జారుగుల శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు టి. అగస్టీన్ రెడ్డి హాజరయ్యారు.మినరల్ వాటర్ ప్లాంట్ పునఃప్రారంభంలో కీలక పాత్ర వహించిన పూర్వ విద్యార్థి పొన్నికంటి కృష్ణకు పాఠశాల తరఫున చైర్మన్, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులోకి రావడం ఆనందదాయకమని పాఠశాల వర్గాలు తెలిపారు.



# మహిళలంటే జగన్‌రెడ్డికి గౌరవం లేదు: ఎమ్మెల్యే 'జూలకంటి'

మాచర్ల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: స్త్రీలంటే జగన్‌రెడ్డికి గౌరవం లేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో కానుకమాత తిరునాళ్ల మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, చర్చిల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, బూతుల పార్టీ వైసీపీ అని ధ్వజమెత్తారు. తోబుట్టువైన షర్మిల పుట్టుకనే ప్రశ్నించిన దుర్మార్గుడు జగన్మోహనరెడ్డి అని అన్నారు. సీఎం



చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌లపై, ఇంట్లో మహిళలపై వైసీపీ నాయకులు సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి పాల్పడి ఎన్నో నీచ రాజకీయాలకు ఒడిగట్టారని దుయ్యబట్టారు. సభ్యసమాజం తలదించుకునేలా వైసీపీ నాయకులు మీడియా ముందు బూతులతో రెచ్చిపోవడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. సీఎంపై వ్యక్తిగత దూషణలకు పాల్పడిన రాంబాబును అరెస్టు చేస్తే జగన్‌రెడ్డి కులాన్ని రెచ్చగొట్టే నీచ రాజకీయాలకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. దాడులు దౌర్జన్యాలు అక్రమ కేసులు వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కేసులో చంద్రబాబునాయుడుకు ఎలాంటి సంబంధం లేదని ఈడీ ఇచ్చిన క్లీన్ చీట్, వైసీపీ దౌర్జన్యాలకు చెంపపెట్టువంటిదన్నారు. జగన్‌రెడ్డి 100 పాదయాత్రలు చేసినా జీవితంలో సీఎం కాలేరని జోస్యం చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకొచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల బండివలె భావించి, ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించాలని చూసే ఏ ఒక్క అరాచక శక్తిని ఉపేక్షించేది లేదని, చట్ట ప్రకారం శిక్షలు అనుభవిస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్రంపై కేంద్రానికి అభిమానం: 'యాగంటి'

మాచర్ల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నిధులు కేటాయించి కేంద్రం అభిమానం చాటుకుందని టీడీపీ సీనియర్ నాయకులు యాగంటి మల్లికార్జునరావు అన్నారు. సోమవారం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక



పరిస్థితిని గమనించి రాష్ట్రానికి అవసరమైన రెండు ప్రధాన ప్రాజెక్టులకు బడ్జెట్లో నిధులు కేటాయించిందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు 3320 కోట్లు, రాజధాని అమరావతి నిర్మాణానికి 1128 కోట్లు కేటాయించిందన్నారు. అలాగే రాష్ట్రంలో రోడ్లు, తాగునీరు, వ్యవసాయ రంగానికి భారీగా నిధులు కేటాయించిందని హర్షం వ్యక్తం చేశారు. వరికపూడిసెల ప్రాజెక్టును పూర్వోదయ పథకంలోకి చేర్చినందున నిధుల కొరత ఉండదన్నారు. ఈ పథకం ద్వారా వరికపూడిసెల ప్రాజెక్టు పరుగులు పెడుతుందన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దేవాలయాలకు, రోడ్ల నిర్మాణానికి, తాగునీటిఇ భారీ ఎత్తున నిధులు సేకరించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు సదుపాయంలో త్వరలో అందుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడులు సృష్టిస్తున్నారు: మధుబాబు



మాచర్ల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త: ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో వైసీపీ నాయకులు అలజడి సృష్టిస్తున్నారని పూడా ఛైర్మన్ చిరుమామిళ్ల మధుబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ నేతలు చేసే కుట్రలకు టీడీపీ శ్రేణులు సంయమనం పాటించాలన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే కుట్రలు చేస్తున్నారన్నారు. అంబటి, జోగి లాంటి వారికి కులాలు వర్తించవు. వైసీపీ బూతు రాజకీయం చేస్తుంది. రాష్ట్రాన్ని వైసీపీ వైరస్ పట్టిపీడిస్తుంది. నకిలీ మదనయం కేసులో జైలుకు వెళ్లి వచ్చినా మాట తీరులో మార్పు లేదు. అసభ్య పదజాలంతో రెచ్చగొట్టి శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేసినా వైసీపీ నాయకులకు బుద్ధి రావట్లేదని మధుబాబు మండిపడ్డారు.

## రాష్ట్రస్థాయిలో ప్రథమంలో నిలిచిన కేరిడ్జ్ విద్యార్థిని

నరసరావుపేట టౌన్,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ::రాష్ట్ర స్థాయి బాలమహోత్సవ్ షాట్‌పుట్‌లో స్థానిక కే రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థిని సిరినందన ప్రథమంలో నిలిచిందని స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జనవరి 31 జనవరి 2 ఫిబ్రవరి 2026 వరకు వడ్లమూడి క్యాంపస్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలల ఉత్సవం - బాలమహోత్సవ్లో షాట్పుట్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో సిరినందన ప్రథమ స్థానం సాధించి పాఠశాలకే గర్వకారణంగా నిలిచిందన్నారు. విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడం ద్వారా శారీరక, మానసిక




వికాసం సాధ్యమవుతుందని నాతాని తెలిపారు. ఈ సందర్భంగా సిరినందనను స్కూల్ డైరెక్టర్ కోమటనేని నాసరయ్య, ప్రిన్సిపాల్ జి. బర్నబాస్, క్యాంపస్ ఇన్చార్జ్ కోట బాపూజీ, పీ.ఈ.టి. సురేష్ అభినందించారు.

## రొంపిచర్ల లో మాజీ ఎమ్మెల్యే డా.గోపిరెడ్డి పర్యటన

రొంపిచర్ల,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :: రొంపిచర్ల మండలంలో వైఎస్ఆర్సిపి వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం పర్యటించారు. మండల కేంద్రమైన రొంపిచర్ల గ్రామంలో రిటైర్డ్



విఆర్ఓ పడాల సుబ్బారెడ్డి మాతృమూర్తి,పడాల ధనమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. ధనమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ఆమె మృతి పట్ల సంతాపాన్ని పార్టీ తరపున తెలియజేశారు. గ్రామంలోని పార్టీ నాయకులు, పెద్దలను కలిసి ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. ఆయన వెంట వైఎస్ఆర్సిపి మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు..

## ఏ.ఎం. రెడ్డి ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ కార్యక్రమం

నకరికల్లు, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ::ఏ.ఎం. రెడ్డి విద్యాసంస్థల (ఆటానమస్) ఆధ్వర్యంలోని ఏ.ఎం. రెడ్డి ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రటన్ టాటా ఇన్నోవేషన్ హబ్ నుండి జి. కృష్ణన్, సీఈఓ , నందన్ టాండి, హెడ్-పార్ట్నర్షిప్స్,సౌమ్య మనోజ్, ప్రోగ్రాం అసోసియేట్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంజనీరింగ్, డిప్లొమా మరియు ఫార్మసీ విద్యార్థులు తమ నూతన ఆవిష్కరణాత్మక ఆలోచనలు, ఇన్నోవేటివ్ ఐడియాలు, ప్రోటోటైప్స్ ను ప్రదర్శించారు. రటన్ టాటా ఇన్నోవేషన్ హబ్ , విజయవాడ మరియు ఏ.ఎం. రెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (ఆటానమస్), ఏ.ఎం. రెడ్డి మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ మధ్య అవగాహన ఒప్పందం (మెమోరాండం ఆఫ్ అండర్స్టాండింగ్) కుదిరింది.



ఈ ఎంఓయూ ద్వారా విద్యార్థుల ఇన్నోవేషన్, స్టార్టప్ సంస్కృతి, పరిశోధన, పరిశ్రమలతో అనుసంధానం మరింత బలపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఆట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఇన్నోవేషన్ మరియు పరిశోధన రంగాల్లో విద్యార్థులకు పూర్తి మద్దతు అందిస్తామన్నా రు.ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీ.హెచ్. మల్లికార్జున, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి. భర్గవభూషణ్ రావు, డిప్లొమా కళాశాల ప్రిన్సిపాల్ కె. కృష్ణా రెడ్డి , అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎ. పావని, పాల్గొన్నారు.

## కోటప్పకొండలో మెగా పారిశుద్ధ్య కార్యక్రమం

నరసరావుపేట,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ::మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరగనున్న కోటప్పకొండ తిరుణాళ్లకు లక్షలాది భక్తులు తరలివచ్చే ప్రముఖ శైవక్షేత్రంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు"స్వచ్ఛ శివరాత్రి – స్వచ్ఛ కోటప్పకొండ" కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఆలయ పరిసరాలను స్వచ్ఛంగా ఉంచి భక్తులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ఎమ్మెల్యే తెలిపారు. కోటప్పకొండలోని ఎర్ర చెరువు పరిసర ప్రాంతాలు, ప్రధాన మార్గాలు, ఘాట్ రోడ్డు, భక్తులు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో విస్తృత పారిశుద్ధ్య పనులు చేపట్టారు.



ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత. దేవాలయ ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచడం ద్వారా భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి మరింత మెరుగుపడుతుంది. ప్రభుత్వం భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కట్టుబడి ఉంది" అని అన్నారు. అధికారులు, పంచాయతీ సిబ్బంది, శానిటేషన్ కార్మికులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మరియు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ప్రజల అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలి: కలెక్టర్ కృతిక శుక్లా

నరసరావుపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ::సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ అర్జీలను



స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 110అర్జీలను జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. అర్జీలను నాణ్యతగా పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

## నిర్ణీత సమయంలో ఫిర్యాదుల పరిష్కారానికి కృషి :పల్నాడు జిల్లా ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట క్రైమ్,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త::పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో పీజీర్స్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బీ కృష్ణారావు పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు.నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఈ



సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ బి.కృష్ణారావు ఫిర్యాదుదారులకు తెలిపారు. పీజీర్స్ లో ఆర్థిక సమస్యలు, కుటుంబ సమస్యలు, పలు మోసాలకు సంబంధించిన సమస్యలు ఫిర్యాదుల రూపంలో ఎస్పీ దృష్టికి వచ్చాయి. అదేవిధంగా బెదిరింపులు, ఆక్రమణలు వంటి పలు అంశాలకు సంబంధించిన 112 ఫిర్యాదులను ప్రజలు పోలీస్ అధికారులకు అందజేసారు.,వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించే పోలీస్ అధికారులకు వాటిని రిఫర్ చేయడం జరిగింది.పీజీర్స్ లో వచ్చిన మహిళలు, వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం పట్ల ప్రత్యేక దృష్టి సాధించాలని ఎస్పి ఆదేశాలు ఇచ్చారు.,క్షేత్రస్థాయిలో విచారణ వేగవంతం చేసి, చట్ట ప్రకారం వారికి న్యాయం చేయాలని పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు. పీజీర్స్ లో తమ సమస్యలపై అర్జీలు ఇవ్వడానికి వచ్చిన ప్రజలకు వాటిని రాసిపెట్టడం లో సిబ్బంది సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో గౌరవ ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ (పరిపాలన) రిజు. సంతోష్ ,నరసరావు పేట మహిళా పోలీస్ స్టేషన్ డి.ఎస్.పి ఎం.వెంకట రమణ పాల్గొన్నారు.

## ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యత : ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండటం ప్రజాప్రతినిధుల బాధ్యతయని, ప్రతి అర్జీపై సమగ్రంగా స్పందించి న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హామీ ఇచ్చారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుండి భారీ సంఖ్యలో



వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రజల వద్ద నుండి ఆయన స్వయంగా అర్జీలు స్వీకరించి, ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించారు. తాగునీటి కొరత, రహదారుల మరమ్మతులు, కాలువల నిర్మాణం, విద్యుత్ సమస్యలు, పింఛన్లు, రేషన్, గృహ నిర్మాణం వంటి పలు అంశాలపై ప్రజలు తమ సమస్యలను వివరించారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు ఇచ్చారు. ప్రజలు కార్యాలయాలకు తిరుగుతూ ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా ఇలాంటి వేదికల ద్వారా వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని, ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు సూచించారు.

## ఆలయ నిర్మాణనికై రూ. 1,25,667 విరాళం

నరసరావుపేట టౌన్,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : ఇస్సపాలెం గ్రామంలోని శ్రీ మహంకాళి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణం కోసం భక్తులు విరాళాలు సమర్పించారు. సోమవారం ఇస్సపాలెం వాస్తవ్యులు కందుల శివాయమ్మ కుమారుడు కందుల వెంకట కోటేశ్వరరావు, సునీతల కుమారుడు కేశవ పవన్ రూ. 1,25,667 చెక్కును ఆలయ ఈఓ. నలబోతు మాధవిదేవికి అందచేశారు. ఈవో మాధవి దేవి మాట్లాడుతూ అమ్మవారి ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులకు సహకారం అందిస్తున్న భక్తులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు సమర్పించే విరాళాలకు ఆదాయపన్ను మినహాయింపు ప్రభుత్వం ఇస్తుందని తెలియజేశారు. దాతలకి ఈ సందర్భంగా అమ్మవారి దర్శనంతో పాటు శేష తీర్థప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బండమూరి చంద్రశేఖర్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు



## వర్సిటీ 3వ సెమిస్టరు ఫలితాల్లో వాగ్దేవి డిగ్రీ విద్యార్థుల విజయభేరి

రొంపిచర్ల, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ::ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ 3వ సెమిస్టరు ఫలితాలలో వాగ్దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు బి.స్సీ, బీసీఎ, బి.కాం లలో మంచి మార్కులు సాధించారు. పట్టణంలో ప్రథమ స్థానంలో తమ విద్యార్థులు నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ కపలవాయి రాజేంద్రప్రసాద్ తెలిపారు.బి.ఎస్సీ హానర్స్ (కంప్యూటర్ సైన్స్) గ్రూపులో



లక్ష్మి మ్మ దేవి 799, రోజా మేరీ 796 మార్కులు సాధించారు.బి.స్సీ హానర్స్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) గ్రూపులో మోనిక రెడ్డి 787 మార్కులు, మాదవి 784 మార్కులు, నీలిమ 783 మార్కులు సాధించారు. అలానే అన్ని గ్రూపులలో 90 పాస్ పెర్సెంటేజ్ తో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల సెక్రటరీ కరెస్పాండంట్ రాయల శ్రీనివాసరావు గారు తెలిపారు. మాథమాటిక్స్ లో 100 కి 100 మార్కులు, స్టాటిస్టిక్స్ లో 100 కి 100 మార్కులు, ఫిజిక్స్ లో 100 కి 98 మార్కులు, కంప్యూటర్స్ లో 100 కి 98 మార్కులు, ఇన్కమ్ టాక్స్ లో 100 కి 96 మార్కులు మరియు అకౌంట్స్ లో 100 కి 95 మార్కులు సాధించారని, ఉత్తమ మార్కులు సాదించటానికి కారకులైన అధ్యాపకులను మరియు విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామకోటేశ్వరరావు, ఒగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్కెపల్లి క్రిష్ణకిషోర్లు అభినందించారు.

## ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట, ఫిబ్రవరి 2 ప్రభాత వార్త :: నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వారికోసం డ్రైవింగ్ శిక్షణ స్కూల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం డిపో మేనేజర్ మాట్లాడుతూ ఇప్పటికే 22 బ్యాచ్ల శిక్షణ పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. పట్టణ మరియు గ్రామాలలోని లైట్ లైసెన్స్ కలిగి హెవీ లైసెన్స్ పొందగోరు డ్రైవర్లకు మంచి అవకాశం అని తెలిపారు. ఏపీఎస్ఆర్టీసీ హెవీ మోటార్ వెహికల్ డ్రైవర్ ట్రైనింగ్ స్కూల్ నందు 22వ బ్యాచి శిక్షణ పూర్తి చేసుకొని సర్టిఫికెట్లు అందజేశామని వారు తెలిపారు. మరియు 23 వ బ్యాచ్ కి అడ్మిషన్స్ జరుగుచున్నవి అని పేర్కొన్నారు. లైట్ లైసెన్సు కలిగిన డ్రైవర్లు హెవీ లైసెన్స్ పొందుటకు తమ దగ్గర శిక్షణ తీసుకున్నట్లయితే మెరుగైన అవకాశాలు ఉంటాయని డిపో మేనేజర్ బి శ్రీనివాసరావు తెలిపారు.

## శ్రీ కొండగురునాధస్వామి తిరునాళ్ళకు పోటెత్తిన భక్తులు

నూజెండ్ల,ఫిబ్రవరి2,ప్రభాతవార్త: మండలంలోని రవ్వారం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండగురునాధ స్వామి తిరునాళ్ళ అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే స్వామివారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులతో పాటుచుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు,భక్తులు వేల సంఖ్యలో స్వామివారిని దర్శించు కొన్నారు. స్వామివారికి తలనీలాలు సుర్పించి పొంగళ్ళు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రభుత్వచీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు,జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు,దేవస్థానం కమిటీ సభ్యులు,దేవాదాయ శాఖాధికారులు







జీ.వీ,మక్కెనకు ఘన స్వాగతం పలికి పూలమాలలు,శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. జీ.వీ,మక్కెన మాట్లాడుతూ తిరునాళ్ళ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని కొండగురునాధస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకున్నారు. తిరునాళ్ళ పురస్కరించుకొని గ్రామస్తులు 8 భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. ప్రభలపై ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రూరల్ సీఐ బ్రహ్మయ్య,ఐనవోలు ఎస్ఐ కృష్ణారావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

## శ్రీ కొండగురునాధస్వామి ఆలయ హుండీ లెక్కింపు

### స్వామివారికి రూ. 8,14,211 ఆదాయం

నూజెండ్ల,ఫిబ్రవరి2,ప్రభాతవార్త: మండలంలోని రవ్వారం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండ గురునాధస్వామి తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. సోమవారం స్వామివారి హుండీల లెక్కింపు కార్యక్రమం ధర్మకర్త,కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో దేవాలయ శాఖ సిబ్బంది పర్యవేక్షణలో నిర్వహించారు. హుండీ లెక్కింపు ద్వారా 564211/ రూపాయలు,కొబ్బరి చిప్పలు, తలనీలాలు వేలం ద్వారా 250000/ రూపాయలు రావడం జరిగింది. స్వామివారికి వచ్చిన మొత్తం ఆదాయం 814211/ అక్షరాల ఎనిమిది లక్షల పద్నాలుగు వేల రెండు వందల పదకొండు రూపాయలు రావడం జరిగిందని దేవాదాయశాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ మంజూష,ఈవోలు శివనాగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నెమలిరెడ్డి,లక్ష్మయ్య ,సుబ్బారెడ్డి, టి.వెంకటేశ్వర్‌రెడ్డి,జూనియర్ అసిస్టెంట్ వెంకాయ్యమ్మ, డి.కోటి,ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.



## డైరీ ఆవిష్కరణ



సత్తెనపల్లి ఫిబ్రవరి 2 ప్రభాత వార్త: సత్తెనపల్లి మండల వనరుల కేంద్రం లో సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి. ఏ.శ్రీనివాస రావు చే ఎస్సీ ఎస్టీ యూఎస్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు. చిలక ఆగస్టు బాబు . రాష్ట్ర నాయకులు. బంక వాసు బాబు.పల్నాడు జిల్లా అధ్యక్షులు. కుంభా.వీరాంజనేయులు పల్నాడు జిల్లా కార్యదర్శులు. కే ఏడుకొండలు. టి సుబ్బారావు . ప్రేమ్ కుమార్. ప్రేమ సాగర్. అచ్చంపేట. ఎస్సీ ఎస్టీ యూఎస్ జిల్లా నాయకులు. బి. రామారావు . ముప్పాళ్ళ మండల. నాయకులు. గార్లపాటి సునీల్. మాచవరం మండల్. గౌరవ అధ్యక్షుడు. దేగల రాంబాబు. మరియు టిడిపి నాయకులు. గరినే పూడి. సాల్మన్ రాజ్. ఎమ్మార్పీఎస్ నాయకులు. గుజ్జర్ల పూడి యేసు రత్నం. ఎన్ఎస్పి నాయకులు చింతపల్లి . బిక్షం. మొదలగువారు పాల్గొన్నారు.

## చిన్నారికి వైకాపా నేత డాక్టర్ 'గజ్జల' ఆశీర్వాదం



రాజుపాలెం ఫిబ్రవరి 2 ప్రభాత వార్త : రాజుపాలెం మండలం కొత్త భోధనం గ్రామానికి చెందిన భూక్య నాగరాజు (జగన్) నాగలక్ష్మి మ్మ కుమార్తె రిషిత పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి చిన్నారిని ఆశీర్వదించిన సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు , బాసు లింగారెడ్డి , సర్పంచ్ పాశం నరసింహారెడ్డి , బండి కోటి నాగిరెడ్డి , వట్టె శివ రెడ్డి , గ్రామ పార్టీ ప్రెసిడెంట్ రాంపాటి నరసయ్య , నాగుల్ మీరా , కుంభ పెద్ద నరసింహారావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 12న దేశవ్యాప్త సార్వత్రి సమ్మెను జయప్రదం చేయండి

నరసరావుపేట క్రైమ్, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త : : ఈనెల 12వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం స్థానిక వినుకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన్ కేంద్రంలోకార్మిక సంఘాలు రైతు సంఘాలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలు విన్నాడాలని లేబర్ కోడ్స్ ని రద్దు చేయాలని, ఎనిమిది గంటల పని దినాన్నాన్ని కొనసాగించాలని తదితర డిమాండ్స్ కోసం సమ్మెను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఈనెల 5 లోపు ఉమ్మడి



సమావేశాలు నిర్వహించాలని, 9న అన్ని నియోజకవర్గాలలో బైక్ ర్యాలీలు చేపట్టాలని ఫిబ్రవరి 12న అన్ని నియోజకవర్గాలలో సమ్మెను జయప్రదం చేస్తూ కార్మిక సంఘాలు రైతు సంఘాలు ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్. ఆంజనేయులు నాయక్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. గోపాలరావు, సిఐటియు జిల్లా నాయకులు విజయ్ కుమార్, హనుమంతరెడ్డి, డి. శివ కుమార్, కామినేని రామారావు, రవి,ఏఐటియుసి జిల్లా నాయకులు ఉప్పలపాటి రంగయ్య, కోయి శీను, ఎస్.కె. చిన్న జాను సైదా,సిహెచ్. నాగేశ్వరరావు, యు. రాజు తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీ బాల్‌బ్యాడ్మింటన్ జట్టుకు కృష్ణవేణి విద్యార్థినుల ఎంపిక

నరసరావుపేట, ఫిబ్రవరి 2 ప్రభాతవార్త ::ఏఎన్యూ మహిళా బాల్ బ్యాట్మింటన్ జట్టుకు స్థానిక కృష్ణవేణి కళాశాలకు చెందిన క్రీడాకారిణిలు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. జనవరి 31 నుండి ఫిబ్రవరి 1 వరకు ఫిరంగిపురంలో జరిగిన ఏఎన్యూ అంతర్ కళాశాలల మహిళా బాల్ బ్యాట్మెంటన్ ఫైనల్స్ పోటీలో తమ కృష్ణవేణి కళాశాల జట్టు మంచి ప్రతిభ చూపిందన్నారు. ఏఎన్యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల జట్టుపై గెలిచి ప్రథమ స్థానం సాధించిందని అన్నారు. అనంతరం జరిగిన ఏఎన్యూ



మహిళా బాల్ బ్యాట్మెంటన్ జట్టుకు తమ కళాశాలకు చెందిన కే. కావ్య, కే.నవ్య, షేక్. ముంతాజ్ ఎంపికయ్యారని చెప్పారు. అన్నా యూనివర్సిటీలో ఈనెల 11 15 వరకు నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మహిళా బాల్ బ్యాట్మెంటన్ పోటీలలో ఏఎన్యూ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల పిడి ఈదర ఆదిబాబు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల మహిళా బాల్ బ్యాట్మెంటన్ క్రీడాకారిణిలను కళాశాల డైరెక్టర్ కె. నాసరయ్య, ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వర రావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఆర్.కే. సతీష్ బాబు, పిడి ఈదర ఆదిబాబు, షేక్. షకీలా అభినందించారు.

# బాపట్ల జిల్లా వార్త



## ఘనంగా శ్రీతాళ్లమ్మ తిరునాళ్ళ సంబరాలు

**నగరం,ఫిబ్రవరి2,ప్రభాతవార్త:** నగరం మండలంలోని ధూళిపూడి గ్రామంలో ఉన్న శ్రీతాళ్లమ్మ తిరునాళ్ల అత్యంత వైభవోపేతరంగా నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా పట్టువస్త్రాలను అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి విద్యుత్ దీపాలతో ప్రవలను కట్టి ఉరేగించారు. వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కు బడులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు మెరుగైన సేవలు అందించాలి : జిల్లా కలెక్టర్

**బాపట్ల,ఫిబ్రవరి2,ప్రభాతవార్త:** అంగన్వాడి కేంద్రాలకు బాపట్ల సేవా సేతు ద్వారా తల్లి ప్రేమను అనుసంధానించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. బాపట్ల సేవా సేతు ద్వారా అంగన్వాడి కేంద్రాలలో మాలిక సదుపాయాల కల్పనపై మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో



సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల సేవా సేతు ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమన్నారు. జిల్లాలో 1,552 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, పూర్తి సౌకర్యాలు కల్పించాలన్నారు. దాతలు అందించే విరాళాలను సద్వినియోగం చేసుకోవడానికి వేదిక ఏర్పాటు చేశామన్నారు. అంగన్వాడి కేంద్రాలలో ఉండే ఆరేళ్లలో చిన్నారులకు తల్లి ప్రేమ అందించేలా ప్రక్రియను ప్రారంభించామన్నారు. ఆయా కేంద్రాలలో ఏ అవసరాలు ఉన్నాయో, వాటన్నిటిని పరిష్కరించ డానికి వివరాలను నిక్షిప్తం చేయాలన్నారు. విరాళాల రూపంలో దాతలు ఇచ్చిన వస్తువులకు ధ్రువీకరణ పత్రాలు సమంత శాఖ అధికారులు ఇవ్వాల్సి ఉందన్నారు. కేంద్రాలకు అవసరమైనవన్నీ వెబ్ సైట్ లో పొందుపరచడానికి అంగన్వాడి సూపర్వైజర్లు, సిడిపివోలకు లాగిన్ లు ఇస్తామన్నారు. పూర్తి వివరాలను పొందుపరచాల న్నారు. పేదలకు బహుళ ప్రయోజనం కల్పించేలా రూపొందించిన వెబ్ సైట్ ను జయప్రదంగా ముందుకు తీసుకెళ్లడానికి సహకరించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన పి4 స్ఫూర్తితో బాపట్ల సేవా సైతం ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో మహిళ శిశు సంక్షేమ శాఖ పిడి రాధ మాధవి, ఐసిడిఎస్ సిడిపివోలు, సూపర్వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

**బాపట్ల,ఫిబ్రవరి2,ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. ఉపాధి హామీ పథకం అమలు తీరుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సోమవారం కలెక్టరేట్ నుంచి వీక్షణ



సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ లో భాగంగా అభివృద్ధి అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని జి రామ్ జి పథకంగా మార్పు చేస్తున్నందున మంజూరైన పనులన్నీ శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పేరు మార్పు నేపథ్యంలో రెండు నెలల్లో ఎలాంటి మంజూరులు ఉండవన్నారు. మంజూరైన పనులని పూర్తి చేయాలని, పూర్తి చేసిన పనులకు తక్షణమే బిల్లులు ఆన్ లైన్ లో సమర్పించాలన్నారు. అధికారులు జాప్యం చేయరాదని సూచించారు. 233 గ్రామపంచాయతీలలో ఉపాధి పనులు జరగకపోవడంపై అధికారులను నిలదీశారు. నిరుపేదలకు జీవనోపాధి చూపాలని, కూలి పనులు వేగంగా చేపట్టాలన్నారు. జల శక్తి అభియాన్ పనులు నిజాంపట్నంలో జాప్యం జరగడంపై ఆరా తీశారు. రేపల్లెలో మురికినీరు ఇంకుడు గుంతల నిర్మాణంలో జాప్యం ఉండరాదన్నారు. వర్మి కంపోస్ట్ యూనిట్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలకు 90 రోజుల పని దినాలు కల్పించాలన్నారు. పల్లె పండుగలో 350 పనులు మంజూరు కాగా కేవలం 136 పనులు పురోగతిలో ఉండడం ఏమిటని ప్రశ్నించారు. మంజూరైన పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ భవనాలు పది మంజూరు కాగా, రెండు భవనాల నిర్మాణం మాత్రమే మొదలు కావడం ఏమిటన్నారు. నిర్మాణ పనులు వేగంగా పనులు ప్రారంభించాలన్నారు. ఉద్యాన పంటలు, కొబ్బరి మొక్కలు లక్ష్యం మేరకు నాటాలన్నారు. భవిష్యత్తు తరాలకు ప్రయోజనంగా ఉండేలా పనులు చేయాలన్నారు. ఉగాది నాటికి 6, 441 గృహ నిర్మాణాలు పూర్తి చేయడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. మార్చి 18వ తేదీ నాటికి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రతి వారానికి అధికారులు లక్ష్యాలను నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పిడి విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి వెంకటేశ్వరరావు, ఎంపీడీవోలు ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

**నగరం,ఫిబ్రవరి2,ప్రభాతవార్త:** ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.రమేష్‌బాబు తెలిపారు. సోమవారం రైతుసేవాకేంద్రాలు, ఏపిసిఎస్‌ఎఫ్ సిబ్బందికి మండలస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజనలో ఈ పంటనమోదు, ఈకేవైసీ, ఏపిఎఐఎమ్ఎస్ యాప్, పొలం ఉన్న ప్రతి ఒక్క రైతుకి విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. అన్ని గ్రామాలలో రైతులు తప్పనిసరిగా పొలం పాస్‌బుక్ లేదా 1బి, ఆధార్ లింక్‌అయిన మొబైల్ నంబర్ తీసుకుని రైతుసేవ కేంద్రల వద్దకు వెళితే మీకు విశిష్ట గుర్తింపు నమోదు చేసుకోవాలని లేనియెడల ప్రభుత్వ పథకాలైన పీఎమ్‌కిసాన్, అన్నదాత సుఖీభవ ,పెట్టుబడిసాయం, పంటల భీమ, రాయితీపై యంత్ర పరికరాలు పొందుటకు అవకాశం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో విఏఏలు ,వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రోజు వృథాగా పోతున్న మంచినీరు

### పట్టించుకోని ఆరుంబాక పంచాయతీ అధికారులు

**చెరుకుపల్లి, ఫిబ్రవరి 2 ,ప్రభాతవార్త :** నీటి సంరక్షణ కోసం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలు వెచ్చించి ఎన్నో పథకాలు ప్రవేశపెడుతుంటే మరోవైపు ప్రజలు త్రాగే మంచి నీటిని రోజుల తరబడి మండలంలోని ఆరంబాక గ్రామపంచాయతీ హరిజనవాడలో వృధాగా రోడ్డుపాలు చేస్తున్నారు. కడవ మంచినీరు కోసం నానా అవస్థలు పడుతున్న ఈ రోజుల్లో మంచినీటికి ఎంత ప్రాముఖ్యత ఉందో ప్రతి ఒక్కరికి తెలిసిన విషయమే. మండలంలో పలు ప్రాంతాల్లో ఇప్పటికి మంచినీటి కోసం తీవ్రమైన అవస్థలు పడుతున్న కాలనీలు ఉన్నాయి. అటువంటిది రోజల తరబడి మంచినీరు కుళాయిల ద్వారా వృధాగా పోతుంటే స్థానికులు గాని సంబంధిత పంచాయతీ అధికారులు కానీ పట్టించుకోకపోవడం గమనార్హం. మండలంలోని ఆరుంబాక హరిజనవాడ లో ప్రధాన రహదారి వెంట కొళాయికి ఉన్న ట్యాపు విరిగిపోవడంతో మంచినీళ్ళు వదిన ప్రతిసారి ఈ ట్యాపు ద్వారా నీరు వృధాగా పోతుంది. ఇక్కడ మంచినీరు వృధాగా పోవడం వల్ల మిగిలిన ప్రాంతాల్లో కొళాయిల ద్వారా మంచినీరు సరిగా రాక ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మంచినీరు కొళాయి ద్వారా వృధాగా పోకుండా కొళాయి మరమ్మతులు చేయించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం : రేపల్లె ఆర్డీవో ఎన్ రామలక్ష్మి

రేపల్లె, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:ప్రజా సమస్యలను సంబంధిత ప్రభుత్వ శాఖలకు పంపించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు దాఖలు చేసే అర్జీలను పరిశీలించి పరిష్కార మార్గం చూపుతామని చెప్పారు. 11 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. పట్టణంలో మురుగునీటి పారుదల వ్యవస్థ సమస్యాత్మకంగా మారినందున పరిష్కార మార్గం చూపాలని రేపల్లె పురపాలక సంఘానికి చెందిన నిర్మల జ్యోతి ఫిర్యాదు చేశారు. భట్టి ప్రోలు మండలంలోని ఓలేరు గ్రామంలో తనకు సంబంధించిన భూమిని సర్వే చేయించాలని ముమ్మనేని నాగేశ్వరరావు అర్జీ అందజేశారు. అమృతలూరు మండలంలోని మూల్పూరు గ్రామంలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయించాలని తెనాలి శామ్యూల్‌పాలసన్ ఫిర్యాదు అందజేశారు. వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయించాలని రేపల్లె పురపాలక సంఘానికి చెందిన ఒలేటి పార్థీష్‌బాబు అర్జీ సమర్పించారు. ఇంటి పన్ను మంజూరు చేయించాలని కొల్లూరు మండలంలోని దోనేపూడికి చెందిన బి.సత్యనారాయణ అర్జీ అందజేశారు. గృహ నిర్మాణం జరిగినా పంపిణీ చేయని నివేశనస్థల పట్టాను ఇప్పించాల్సిందిగా కొల్లూరు మండలంలోని తోకలవారిపాలెంకు చెందిన పూలపాటి చిట్టెమ్మ అర్జీ సమర్పించారు. రేపల్లె మండలంలోని పేటేరు ఆంజనేయస్వామి కాలనీలో రహదారి నిర్మాణం నాణ్యతాప్రమాణాలకు విరుద్ధంగా జరిగినందున పరిశీలించి కారకులపై చర్యలు తీసుకోవాలని అర్జీ అందింది. చేపల చెరువుల కారణంగా పొలాల్లో వ్యవసాయరంగానికి సంబంధించిన పంటల దిగుబడులు తగ్గి నష్టం ఏర్పడిందని నష్ట పరిహారం ఇప్పించాలని కొల్లూరు మండలంలోని దోనేపూడికి చెందిన వెనిగళ్ళ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. రీసర్వేలో భూమి తగ్గినందున మరలా తన భూమిని సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని నిజాంపట్నం మండలంలోని పల్లపట్లకు చెందిన పేర్ల సుజాత అర్జీ అందజేశారు. రేపల్లె పురపాలక సంఘంలోని తన స్థలాన్ని సర్వే చేయించాలని పట్టణానికి చెందిన దామెర్ల శ్రీనివాసరావు అర్జీ సమర్పించారు.



## నియోజకవర్గ అభివృద్ధికి కృషి

**నిజాంపట్నం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః** నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని కొత్తపాలెంలో పలు అభివృద్ధికార్యక్రమాలకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామపంచాయితీలలో రోడ్లు, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయించి నిర్మాణాలు చేయిస్తున్నామన్నారు. పేదలకు అండగా ఉండేందుకు, అనారోగ్యానికి గురైన వారికి చికిత్స నిమిత్తం కోట్లాది రూపాయలు సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరు చేయిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రూ.82లక్షలతో నిర్మించనున్న ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణానికి, రూ.36లక్షలతో నిర్మించనున్న వెల్నెస్ సెంటర్ నిర్మాణానికి, రూ.25లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య, జనసేన పిఒసి మత్తి భాస్కరరావు, మండల తెదెపా అధ్యక్షుడు దండుప్రోలు వెంకటేశ్వరరావు, బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గుర్రం మురహరిరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## చట్టపరిధిలో అర్జీదారుల సమస్యలను విచారించి పరిష్కరించాలి

**బాపట్ల,ఫిబ్రవరి02,ప్రభాతవార్త:** చట్టపరిధిలో త్వరితగతిన విచారించి అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ



బి.ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ సోమవారం స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 62 మంది అర్జీదారులు తమ సమస్యలను విన్నవించుకొని రాతపూర్వక అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను కూలంకషంగా విని, వెంటనే సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ చేసి చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఒకవేళ అర్జీని పోలీస్ శాఖ చట్టపరిధిలో పరిష్కరించడం సాధ్యంకాని పక్షంలో, ఆ సమస్య పరిష్కారానికి సంప్రదించవలసిన అధికారుల వివరాలను అర్జీదారులకు తెలియజేయాలన్నారు. అర్జీలు పదేపదే పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. వృద్ధులు, మహిళలను పదేపదే పోలీస్ స్టేషన్లు, పోలీస్ కార్యాలయాలకు పిలిపించవద్దన్నారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై సమగ్ర నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని సంబంధిత విభాగానికి పంపాలన్నారు. కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన మోసాలు తదితర పలు సమస్యల పరిష్కారానికి సంబంధించి 62 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి. జగదీష్ నాయక్, పీజీఆర్ఎస్ సెల్ మహిళా ఎస్ఐ లక్ష్మీరాజ్యం , ఇతర పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## వైకాపాకు పుట్టగతులు కూడా ఉండవు

### ప్రజలు 11 స్థానాలకే పరిమితం చేసినా వైసిపి నాయకులకు బుద్ధిరాలేదు

**బాపట్ల,ఫిబ్రవరి2,ప్రభాతవార్త:** ముందు చూపు, రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్నన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుపై అసభ్యపదజాలంతో మాజి మంత్రి అంబటి రాంబాబు మాట్లాడటం సరైనది కాదని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం సాయింత్రం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న పట్టణ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ అనుచిత వాఖ్యలు చేసిన అంబోతు రాంబాబు, సంబరాల రాంబాబును పార్టీ నుంచి వెంటనే బహిష్కరించాలన్నారు. చట్టం ముందు ఎవ్వరూ అతీతులు కారని చట్టాన్ని చేతిలోకి తీసుకున్న వాళ్ళ పరిస్థితి ఏలా ఉంటుందో తెలుస్తుందన్నారు. కల్తి సారా ,మందు అమ్ముకునే జోగి రమేష్ జైలుకు వెళ్ళి వచ్చినా



సిగ్గురాలేదన్నారు. ఏం మాట్లాడుతున్నాడో అర్ధం కాకుండా మాట్లాడుతున్నాడన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపికి పుట్టగతులు కూడా ఉండవన్నారు. తిరుపతి ప్రసాదమైన లడ్డులో కల్తి లేదని మాజి ఎమ్మెల్యే కోనా రఘుపతి చెప్పటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తూనే ఉన్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని కులాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతూ అలజడులు సృష్టించాలని వైసిపి చూస్తుందన్నారు. రాష్ట్ర నాటక పరిషత్ డైరెక్టర్, సీనియర్ నాయకులు మందపాటి అంద్రేయ మాట్లాడుతూ తిరుపతి లడ్డు విషయంలో సిట్ ద్వారా నిజాలను నిగ్గు తెల్చినా అంబోతు రాంబాబు ముఖ్యమంత్రిపై బూతులు మాట్లాడటం ఎంతవరకు సమంజస మన్నారు. వైసిపి బూతు రాజకీయం చేస్తుందన్నారు. వల్లు దగ్గర పెట్టుకోవాలన్నారు. మరళా ఇటువంటి చర్యలకు పాల్పడితే తగిత బుద్ధి చెబుతామన్నారు. నకలీ మద్యం కేసులో జైలు కెల్లివచ్చినా మాట జోగి రమేష్‌కు మాట తీరు మారలేదన్నారు. లోకేష్‌పై ఇష్టమొచ్చినట్లు పిచ్చిపట్టినట్లు మాడ్లాడుతున్నారన్నారు. వైసిపి నాయకులు జాగ్రత్తగా మాట్లాడాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే సరైన గుణపాఠం చెబుతారన్నారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అల్లం గోపి కృష్ణ మాట్లాడుతూ2019లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాజకీయ నాయకులు అంటే విలువ లేకుండా రౌడిలాగా నీచమైన రాజకీయాలు అలవాటయ్యాయన్నారు. ఎవరైతే బూతులు మాట్లాడతారో, ఎవరైతే దౌర్జాన్యాలు చేస్తారో వారికి పదవులు ఇవ్వడం వెఎస్ జగన్ అనవాయితీ చేశారన్నారు. జోగి రమేష్ బూతులు మాట్లాడటంలో అనుభవం ఉన్న వ్యక్తి అందువలనే మంత్రి ఇచ్చారన్నారు. అదే బాటలో అంబటి కూడా మంత్రి పదవి ఇచ్చిన ఘనత వైసిపికే దక్కుతుందన్నారు. రాష్ట్రం అభివృద్ది చెందకుండా ఉండాలన్నతే వైసిపి లక్ష్యమన్నారు. జోగి రమేష్ కులాలకు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడన్నారు. కూటమి ప్రభుత్వాన్ని దెబ్బతీయాలనే అలోచనతో వైసిపి పార్టీ ప్రయత్నాలు చేస్తుందన్నారు. అసభ్య పధజాలంతో రెచ్చగొట్టి శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తున్నారన్నారు. ప్రజలు 11 స్ధానాలకే పరిమితం చేసినా వైసిపి నాయకులకు బుద్దిరాలేదాన్నరు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం శ్రీనివాసరావు, తెలుగు యువత అద్యక్షులు దారా ఆశోక్, రాష్ట్ర మైనార్టీ నాయకులు ఫరీద్ మస్తాన్, కొల్లూరు వెంకటరావు, విన్నకోట వీరయ్య నాయుడు, సూరగాని శేఖర్, బీమా కోటేశ్వరరావు, ప్రసాద్, రాఘవేంద్ర, పల్లంశెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## అసత్య ప్రచారంపై పోలీసులు చర్యలు తీసుకోవాలి

**రేపల్లె, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారని కూటమి ప్రభుత్వం అవాస్తవ ప్రచారం చేయడం మహా పాపమని వైఎస్సార్ కా ంగ్రెస్ పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. సోమవారం రేపల్లె టౌన్ ఎస్ఐ రాజశేఖర్, రూరల్ సర్కిల్ కార్యాలయంలో అవాస్తవ ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ లడ్డు వ్యవహారంపై సిబిఐ స్పష్టమైన నివేదిక సమర్పించినప్పటికీ సిఎం చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో తెలుగుదేశం పార్టీ నేతలు ప్రజలను గందరగోళానికి గురిచేశారని చెప్పారు. జగన్మోహన రెడ్డిపై బురద జల్లడం దురదృష్టకరమని గణేష్ అన్నారు. అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఖాతరు చేయనిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. కలియుగ దైవం ఏడుకొండల స్వామి అంతా గమనిస్తున్నాడని వచ్చే ఎన్నికలలో జగన్ సిఎం కావడం తథ్యమన్నా రు. అంబటి రాంబాబు, వైసీపీ నాయకులపై అక్రమ కేసులు బనాయించడం విచారకం ˆమన్నారు. అసత్య



ప్రచారానికి సంబంధించిన ఫ్లెక్సీలను తొలగించడంతో పాటు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిత్రాల ఓబేదు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టిఎంరావు హైస్కూల్‌లో ఆధార్ క్యాంపు

భట్టిప్రోలు(రేపల్లె), ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:స్థానిక తమ్మన మల్లికార్జునరావు ఉన్నత పాఠశాలలో ఆధార్ క్యాంపు జరుగుతున్నదని భట్టి ప్రోలు సబ్ పోస్ట్‌మాస్టర్ ఆర్.చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. 4వ తేదీ వరకు ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నందున మార్పులు సరిచేసుకోవచ్చని చెప్పారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు సరిచేయబడతాయని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు రూ.75, రూ.125 వంతున నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఆధార్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## సరికొత్త పట్టాదారు పాసుపుస్తకాలతో రైతులకు ప్రయోజనం : అనగాని శివప్రసాద్

**రేపల్లె, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పట్టాదారు పాసుపుస్తకాలతో రైతాంగం చట్టపరమైన ఆర్థిక ప్రయోజనాలను సులువుగా పొందేందుకు వీలేర్పడుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు, రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ చెప్పారు. సోమవారం రేపల్లె మండలంలోని కారుమూరులో జరిగిన గ్రామ సభలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ పాత పట్టాదారు పాసు పుస్తకాల స్థానంలో సమగ్ర భూ రీసర్వే అనంతరం సరికొత్త ఇ-టైటిల్ డీడ్ కమ్ పట్టాదారు పాస్‌బుక్‌ను రైతులు పొందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రణాళికా బద్ధంగా వ్యవహరించడం అభినందనీయమన్నారు. రేపల్లె ఆర్డీవో ఎన్.రామలక్ష్మి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో ప్రభుత్వ రాజముద్రతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేస్తున్నామని చెప్పారు. భూమిపై యాజమాన్య హక్కులను నిరూపించడానికి, రైతు భరోసా, పంట రుణాల వంటి ప్రభుత్వ పథకాలకు, భూమి కొనుగోలు, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కోసం పట్టాదారు పాస్ పుస్తకం ఉపయోగపడుతుందని రామలక్ష్మి వివరించారు. ఈ సంవత్సరం జనవరి నెల 2వ తేదీ నుంచి కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కోసం రెవెన్యూ డివిజన్ పరిధిలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. యాజమాన్య హక్కులను ధృవీకరించే ముఖ్యమైన పత్రాలతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను రైతులు పొందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో రేపల్లె మండల రెవెన్యూ అధికారి ఎం.శ్రీనివాసరావు, రేపల్లె మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిబాబు, సర్పంచ్ గుడి రమాదేవి, రేపల్లె నియోజకవర్గ జనసేన పిఒసి మత్తిభాస్కర్, రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చేనేత రంగానికి అనుకూలంగా లేని కేంద్ర బడ్జెట్

**రేపల్లె, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** పార్లమెంట్‌లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చేనేత రంగాన్ని నిరుత్సాహపర్చిందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.200 కోట్లు మాదిరిగానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేటాయించడం విచారకరమన్నారు. చేనేత రంగం అభివృద్ధికి రూ.200 కోట్ల నిధులు ఏవిధంగా సరిపోతాయని, చేనేత కార్మికుల సంక్షేమం ఎలా నెరవేరుతుందని బాలాజీ ప్రశ్నించారు. చేనేత రంగంపై విధించిన జిఎస్టీ రద్దు, నేషనల్ హ్యాండ్‌లూమ్ బోర్డు పునరుద్ధరణ ప్రస్తావన లేకపోవడం కడు శోచనీయమన్నారు. చేనేతను జౌళిశాఖ నుంచి వేరుచేసి చేనేతలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లు కేటాయించాలనే డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందన్నారు. చేనేత పరిశ్రమ సంక్షేమం కోసం నేతన్నలు ఉద్యమించక తప్పేలా లేదని ఆయన వెల్లడించారు.



## గ్రామదేవతకు ప్రత్యేక పూజలు

**రేపల్లె, ఫిబ్రవరి2, ప్రభాతవార్త:** పట్టణంలోని గ్రామదేవత బూరుగులమ్మ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవం సోమవారం ముగిసింది. బూరుగులమ్మ అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. దేవాలయ అర్చకుడు నంది వెలుగు భానుసుధాకర్ గురుకులం ఆధ్వర్యంలో అమ్మవారికి ఊంజల సేవ జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అంద జేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## అసత్యప్రచారాలు చేసే కూటమి నాయకులపై చర్యలు తీసుకోవాలి

**నిజాంపట్నం, ఫిబ్రవరి 2, ప్రభాతవార్తః** కలియుగ దైవం తిరుపతి శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని అసత్య ప్రచారాలు చేస్తున్న కూటమి నాయకులపై చర్యలు తీసుకోవాలని వైకాపా మండల శాఖ అధ్యక్షుడు రాంబాబు కోరారు. సోమవారం ఈ విషయమై నిజాంపట్నం పోలీస్‌స్టేషన్లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ప్రసాదంలో జంతువుల కొవ్వులేదని న్యాయస్థానాలు, సిట్ అధికారులు తెలిపినా కూటమి ప్రభుత్వం, నాయకులు అసత్య ప్రచారం చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం హేయమైన చర్య అన్నారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినవారిపై చర్యలు తీసుకోవాలని ఆయన నిజాంపట్నం పోలీస్‌స్టేషన్లో వైకాపా నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు.




## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

**రేపల్లె, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త:** లేబర్ కోడ్స్ అమలుకు వ్యతిరేకంగా ఈ నెల 12వ తేదీ జరిగే దేశవ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆదర్శ డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని కార్మిక సంఘాలు సంఘటితంగా ఆందోళనబాట పట్టాలని పిలుపునిచ్చారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దుకు ఉద్యమించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు శింగం వాణిశ్రీ, పడమటి బిక్షాలు, కోన శ్రీనివాసరావు, మండవ శోభారాణి, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయంగా, రైతు బలోపేతానికి కూటమి ప్రభుత్వం చారిత్రాత్మకమైన చర్యలు తీసుకొంటుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో జీడీసీఎమ్మెస్ నూతన కార్యాయం గోడౌను



ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నరేంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతు కుటుంబం ఆర్థికంగా బలపడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. వ్యవసాయాంత్రీకరణలో భాగంగా డ్రోన్లను అందజేస్తున్నట్లు చెప్పారు. పురుగుమందుల పిచికారి, ఎరువుల పంపిణీ, పంటల పర్యవేక్షణ వంటి పనుల్లో డ్రోన్ సాంకేతికత రైతులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఎరువుల సరఫరాలో ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల రైతులందరికీ అవసరమైన మేరకు ఎరువులను అందించగలిగామన్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు పగడ్బందీగా చర్యలు తీసుకున్న అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా భూముల రీ సర్వే పారదర్శకంగా నిర్వహిస్తూ రైతుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భూ వివాదాలను తగ్గించేందుకు సాంకేతిక ఆధారిత వ్యవస్థను తీసుకొచ్చామన్నారు. జీడీసీఎమ్మెస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ రైతులకు ధాన్యం మద్దతు ధర ఇవ్వడంతోపాటు 24గంటల్లోపే నగదు చెల్లింపులు చేసిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి ఆర్థిక భరోసా కల్పించిందన్నారు. గత ప్రభుత్వం రైతుకు చెల్లించాల్సిన రూ.12వందల కోట్ల బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు వడ్రాణం మార్కండేయబాబు, జీడీసి ఎమ్మెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ హరిగోపాలం, ఎడిఎ వెంకటరమణ, మాదల వెంకటేశ్వరరావు, బండ్లమూడి బాబూరావు, బొర్రు రామారావు, చలమశెట్టి సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం : జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

**గుంటూరు క్రైమ్,ఫిబ్రవరి2,ప్రభాతవార్త:** జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ప్రజల నుండి నేరుగా పలు ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారం కోసం తక్షణ ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్న.ప్రజల ఫిర్యాదులకు సంబంధిత పోలీస్ అధికారులు నిర్ణీత సమయంలో స్పందించి, తగిన చట్టపరమైన చర్యలు వేగంగా తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.ఒకసారి వచ్చిన అర్జీలు మళ్లీ పునరావృతం కాకుండా, పూర్తి స్థాయిలో విచారణ జరిపి తుది పరిష్కారం చూపాలని సూచించారు.పోలీస్ శాఖ ప్రజలలో నమ్మకం, భరోసా కల్పించాలంటే, ప్రజా సమస్యల పరిష్కారాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకోవాలని అన్ని స్థాయి అధికారులను సూచించారు.ప్రజల సమస్యలను వినడానికి, వాటిని సమర్థవంతంగా పరిష్కరించడానికి వేదికను నిరంతరం నిర్వహిస్తామని ఎస్పీ తెలిపారు.కుటుంబ తగాదాలు, ఆస్తి వివాదాలు, ఆర్థిక మరియు వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించిన పలు అర్జీలను ఎస్పీ స్వయంగా పరిశీలించారు.ప్రతి ఫిర్యాదును సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, తక్షణ



చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్)జి.వి. రమణమూర్తి,మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు,ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ బిలాలుద్దిన్,ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సందేశం:ప్రజల సమస్యలను వినడమే కాకుండా, వాటికి తక్షణ పరిష్కారం చూపించడం గుంటూరు జిల్లా పోలీస్ వ్యవస్థ ప్రధాన బాధ్యత. ప్రతి పౌరుడికి పోలీస్ శాఖ అందుబాటులో ఉంటుందని ప్రజలు నమ్మకం కలిగి ఉండాలి."ప్రజలకు సత్వర న్యాయం – పోలీస్ వ్యవస్థలో ప్రజా విశ్వాసం"

# శాంతిభద్రతలకు భంగం కలిగించే తెదేపా నాయకులపై చర్యలు తీసుకోవాలి

## -వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

**పొన్నూరు, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** పట్టణ కేంద్రాల్లో కల్తీ నెయ్యి అంశంపై సిట్(ఎస్ఐటి) చార్జిషీట్‌కు విరుద్ధంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి, టిడిడి మాజీ ఛైర్మన్లు వై.వి.సుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి ఫోటోలతో తప్పుడు, అపవాదులు కలిగిన పోస్టర్లు ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నవారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ లావూరి వీరానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. తప్పుడు,అపవాదు పోస్టర్లను ప్రదర్శించడమే కాకుండా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలను గుర్తించి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సీబీఐ చార్జిషీట్‌లో జగన్మోహనరెడ్డి, వైవిసుబ్బారెడ్డి, భూమన కరుణాకరరెడ్డిలపై ఎలాంటి నేరారోపణలు, పాత్ర నిర్ధారణ లేదన్నారు. సిట్ దర్యాప్తు పూర్తిగా ట్యాబ్ నివేదికలు, డిజిటల్ ఫోరెన్సిక్ ఆధారాలు, పత్రాదారులు, చట్టబద్ధమైన సాక్ష్యాలతోనే ఆధారపడి సాగిందేగానీ, రాజకీయ పార్టీలు, వ్యక్తుల ప్రమేయం ఉందని ఎక్కడా నిర్ధారించ లేదన్నారు. ఈ పరిస్థితిలో చార్జిషీట్‌లో లేని ఆరోపణలను ప్రజా ప్రదేశాల్లో పోస్టర్ల రూపంలో ప్రచారం చేయడం అత్యంత అక్రమం, బాధ్యాతారాహిత్యం, అపవాదులు కలిగించే చర్యగా భావించబడుతుందన్నారు. ఈ పోస్టర్ల కారణంగా ప్రజల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు పెరిగి, మాటల తగాదాలు, వాగ్వావాదాలు చోటుచేసుకుంటూ శాంతిభద్రతలకు భంగం కలిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పోస్టర్లను ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన టిడిపి



నాయకులను, కార్యకర్తలను గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసినవారిలో ఆకుల వెంకటేశ్వరరావు, ఎందేటి వెంకట సుబ్బయ్య, బోయిన శివనాగరాజు, అంబటి వెంకటేశ్వరరావు, గేరా సంజీవ్, మూకిరి అనీల్‌కుమారి, బలగాని రమేష్, నల్లమోతు రవీంద్రబాబు, చుందూరు వీరయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రానికి బడ్జెట్లో గుండు సున్నా

## వైకాపా సమన్వయకర్త బలసాని కిరణ



వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : కేంద్ర ప్రభుత్వం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హక్కుల విషయంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి క్యాంపు కార్యాలయంలో సోమవారం బలసాని ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ.. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రాభి వృద్ధికి ఒక్కరూపాయి కూడా కేటాయించలేదని, ఐనా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కేంద్రం ముందు తలవంచి నిలబడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే కేంద్రం ఆదుకుంటుందని ప్రజలు ఆశపడ్డారని, కానీ అమరావతికి బీజేపీ ఎప్పుడూ మద్దతు ఇవ్వలేదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, అయినా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంలో టీడీపీ, జనసేన పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు తీసుకురావాల్సిన బాధ్యత బీజేపీదేనని, కానీ చంద్రబాబు, పవన్ ఇద్దరూ రాష్ట్రాన్ని అట్టడుగు స్థాయికి తీసుకెళ్లే విధానాలకు వంతపాడుతున్నారని ఆరోపించారు. బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయింపులు గుండు సున్నాగా ఉన్నాయని, అయినా కొన్ని పత్రికలు వరాల జల్లు అంటూ రాయడం విడ్డూరమన్నారు. కేంద్ర ప్రభుత్వం టిడిపి, జనసేన మద్దతుతోనే నడుస్తోందని చెప్పిన నేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లి బిజెపి పెద్దల కాళ్లు మొక్కుతూ తిరుగుతున్నారని విమర్శించారు. స్పెషల్ ఫ్లైట్ వేసుకుని ఢిల్లీ వెళ్లి ఏం సాధిస్తున్నారని ప్రశ్నించారు.177 కేటగిరీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఒక్క దానికి కూడా నిధులు కేటాయించలేదని, పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్, విశాఖ పోర్ట్ వంటి కీలక రంగాలకు కూడా గుండు సున్నానే ఇచ్చారని ఆరోపించారు. పోలవరం జాతీయ ప్రాజెక్ట్ అయినప్పటికీ బడ్జెట్‌లో కేటాయించిన రూ.3320 కోట్లు మా ప్రభుత్వంతో పోలిస్తే చాలా తక్కువని తెలిపారు. రాజధాని అమరావతికి మొత్తం రూ.2066 కోట్లు సాయం అంటున్నారని, అందులో ప్రపంచ బ్యాంక్ నుంచి రూ.432 కోట్లు రుణ మేనని, అప్పును కూడా గ్రాంట్‌లా చూపిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. రాజధాని ప్రాంతంలో రాజ్ భవన్, అసెంబ్లీ, హైకోర్టు, సెక్రటేరియట్ వంటి మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత కేంద్రానిదే అయినా బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించ లేదన్నారు. స్టీల్ ప్లాంట్ నష్టాల్లో ఉన్నా కాపాడేందుకు కేంద్రం ఒక్క రూపాయి ఇవ్వలేదని, దేశవ్యాప్తంగా ఐఐటీ సంస్థలకు రూ.10 వేల కోట్లు కేటాయిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ఐఐటీలకు మాత్రం నిధులు ఇవ్వలేదని పేర్కొన్నారు. గూగుల్‌కు పన్ను రాయితీలు ఇస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏం లాభమని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్, లోకేష్ ఢిల్లీ పర్యటనలు ప్రజల కోసం కాకుండా సీక్రెట్ ఎజెండాలతోనే జరుగుతున్నాయని ప్రజల హక్కుల కోసం కేంద్రాన్ని ఏం అడగడంలేదని ఆరోపించారు. గుంటూరులో అంబటి రాంబాబు, విజయవాడలో జోగి రమేష్ ఇళ్లపై జరిగిన దాడులపై తీవ్రంగా స్పందించారు. ఇది ప్రభుత్వ ప్రోత్సహిస్తున్న రౌడీయిజమని, ఫ్లెక్సీలు తీయమంటే కత్తులు, కర్రలతో వెళ్లడం ఏ రాజ్యాంగ పాలన అని ప్రశ్నించారు. అంబటి రాంబాబు ఇంటిని ధ్వంసం చేసిన టిడిపి గుండాలపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారా? అని ప్రశ్నించారు. ఈ దాడిని ఖండిస్తున్నామని, ఆసమయంలో అంబటి కుటుంబ సభ్యులు బయటకు వచ్చి ఉంటే ప్రాణాపాయం జరిగుండేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి దాడుల పరిణామాలు 2029లో కూటమిలోని టిడిపి, జనసేన నేతలు అనుభవించక తప్పదని హెచ్చరిస్తూ, ప్రజల ఓర్పుకు కూడా ఒక హద్దు ఉంటుందని స్పష్టం చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి 2029లో జరిగే శాసనసభ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ స్థానాలతో గెలుపొంది రెండవసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని జోష్యం చెప్పారు. వైసిపి పార్టీ నేతలు, కార్యకర్తలు కేసులకు భయపడే వ్యక్తులు కాదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని తెలియజేశారు.

# ఇంటిపన్ను వసూళ్ళ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

## -ఎంపీడీవో విజయలక్ష్మి

**కొల్లిపర,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** ఇంటిపన్ను వసూళ్ళ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో



విజయలక్ష్మి అన్నారు.సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదరులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో దోమల మందులను పిచికారీ చేయాలన్నారు.ఇంటి పన్నులను ప్రజలు ఆన్‌లైన్‌లో చెల్లించే విధంగా అవగాహన కలిగించాలన్నారు.సమావేశంలో పరిపాలనాధికారి కిషోర్‌కుమార్,సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో అనుమతి లేని ఫ్లెక్సీలు,బ్యానర్లను తొలగించాలి

## -ఎస్ఐ ప్రసాద్

**కొల్లిపర,ఫిబ్రవరి 2 ప్రభాతవార్త:** గ్రామాల్లో అనుమతి లేని ఫ్లెక్సీలు,బ్యానర్లను తొలగించా లని వాటిని తొలగించేటప్పుడు ఎవరైనా అడ్డుకుంటే తన దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ ప్రసాద్ అన్నారు.



సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు,మహిళా పోలీసులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భ:ంగా ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించేందుకు గ్రామ ప్రజలు సహకరించాలన్నారు.ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో ఫ్లెక్సీలను,బ్యానర్లను తొలగించటానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

# ముందుకు నడిపించేది క్రమశిక్షణ మాత్రమే

## ఏపి టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు

**చేబ్రోలు(పొన్నూరు), ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** ప్రేరణతో మనం లక్ష్యం వైపుగా మొదటి అడుగు వేసినప్పటికీ...మనల్ని నిరంతరం గమ్యం వైపుగా



ముందుకు నడిపించేది క్రమశిక్షణ మాత్రమేనని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లవరపు సూర్యతేజ(ఐఆర్ఎంఎస్) అన్నారు. చేబ్రోలు మండలం, వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జరుగుతున్న రాష్ట్రస్థాయి రెండో ఎడిషన్ విజ్ఞాన్ బాల మహోత్సవ్-2కే26 వేడుకలు మూడో రోజు సోమవారం ఘనంగా ముగిశాయి. క్రీడా మైదానాల నుంచి సాంస్కృతిక వేదికల వరకు ఎక్కడ చూసినా విద్యార్థుల ఉత్సాహం, కేరింతలు, చప్పట్లు శబ్దాలతో యూనివర్సిటీ ప్రాంగణం కళకళలాడింది. మూడు రోజులపాటు జరిగిన ఈ బాల మహోత్సవ్‌లో క్రీడలు, కళలు, సాహిత్యం, సాంస్కృతిక విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి అందరి మనసులను దోచుకున్నారు. ముగింపు వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లవరపు సూర్యతేజ మాట్లాడుతూ తాను 8వ తరగతిలోనే ఐఎఎస్ కావాలనే లక్ష్యాన్ని నిర్ణయించుకున్నానని తెలిపారు. అప్పటి నుండి ఆ దిశగా నిరంతరం కృషి చేశానని, లక్ష్యం స్పష్టంగా ఉంటే మార్గం కూడా స్పష్టంగా కనిపిస్తుందన్నారు. చిన్న వయసులోనే లక్ష్యాన్ని నిర్ణయించుకుని, క్రమశిక్షణతో శ్రమిస్తే ఏ రంగంలోనైనా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. ఇంచార్జివీసి కేవీ క్రిష్ణకిషోర్ మాట్లాడుతూ క్రీడల విషయంలో నిరంతర సాధన ఉంటే తప్పకుండా విజయాన్ని సాధించవచ్చునని చెప్పారు. చదువు, క్రీడలను సమతుల్యంగా కొనసాగించడమే సంపూర్ణ అభివృద్ధికి మార్గమని సూచించారు. విద్యతో పాటు క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. విజేతలకు ట్రోఫీలను, నగదు బహుమతులును అందజేశారు.

# ఫిబ్రవరి 12 న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి : ప్రజా సంఘాల పిలుపు

**పెదనందిపాడు ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త) :** కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని సోమవారం పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట శివరావు అధ్యక్షతన ప్రజాసంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి జి. రమణ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నారన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడులను ప్రవేశపెట్టిందని తెలిపారు. వీటి వలన కార్మికులకు ఉన్న కనీస వేతనం, పని గంటలు, సామాజిక భద్రత, సమ్మె హక్కు వంటి అంశాల్లో ఉన్న హక్కులను లేకుండా చేస్తుందన్నారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలు మార్చారన్నారు. పాత చట్టాలను అమలుచేసి, నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్రం నూతన మార్పులు తెచ్చి రాష్ట్రాల మీద భారాలు వేస్తున్నాయన్నారు. ఈ మార్పును రద్దుచేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరారు. అంగన్వాడీలు గత ప్రభుత్వంలో చేసిన సమ్మె సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. వివోఏ లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు. నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించడంలో పాలకులు విఫలమయ్యారని, సామాన్య మద్దతు తరగతి ప్రజలు ధరాభారంతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. నిత్యవసర ధరలను అదుపు చేయాలని కోరారు. మద్యం మత్తులో ప్రజలను ముంచి ప్రభుత్వం ఖజానాను నింపుకుంటుందని విమర్శించారు. పెట్టుబడుదారులకు వేలకోట్ల రాయితీలు ఇస్తూ, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకపోవడం సమంజసం కాదన్నారు. రైతులకు కనీస మద్దతు ధరల చట్టం తీసుకురావాలని, పంటల బీమా పథకాన్ని ప్రభుత్వాలే ఉచితంగా అమలు చేయాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని కోరారు. శనగ, మొక్కజొన్న పంటలను మద్దతు రేటుకు స్థానికంగా మార్కెట్ యార్డులలో కొనుగోలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటమే మార్గం అని, ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మిక హక్కులను కాపాడేందుకు ఫిబ్రవరి 12 న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు మండల నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 12 వ తారీకు ఉదయం 10 గంటలకు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెదనందిపాడు లోని తేళ్ల నారాయణ విజ్ఞాన



కేంద్రం వద్దకు రావాలని కోరారు. అక్కడ నుంచి ర్యాలీ నిర్వహించిన అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయంలో వివిధ సంఘాల సమస్యలను ఆయా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రాల రూపంలో అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర, కన్నెగంటి చంద్ర రావు, పోపూరి సుధీర్, అంగన్వాడి సంఘం నాయకులు ధనలక్ష్మి, ఉదయలక్ష్మి, ఆశా వర్కర్ల సంఘం నాయకులు సరళ, సరిత, మహిళా సంఘం నాయకులు పి భువనేశ్వరి, పెన్షనర్ల సంఘం నాయకులు జంపని రామారావు, నూర్ భాషా సుభాని సాహెబ్, మధ్యాహ్న భోజనం సంఘం నాయకులు మర్రి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయి

## కేంద్ర ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో జోక్యం చేసుకోవాలి

**పొన్నూరు, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారాయని, ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి సర్కార్ పెట్రోలు బాంబుల సంస్కృతికి తెరతీసిందన్నారు. జగన్మోహనరెడ్డి



హయాంలో తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపించడం, సుప్రీంకోర్టు ఈ విషయంపై సిబిఐ విచారణకు ఆదేశించడం జరిగిందన్నారు. సిబిఐ దేశంలోని వివిధ ల్యాబ్‌లలో పరీక్షలు నిర్వహించి, వాటి రిపోర్టును తీసుకొని సుప్రీంకోర్టుకు సమర్పించడం జరిగింది. సీబీఐ నివేదికలో లడ్డూలో ఎలాంటి జంతువుల కొవ్వు కలవలేదని స్పష్టం చేశారన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అలజడులు సృష్టించడం, వైకాపా నాయకులు, మాజీ మంత్రులను లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడ్డారన్నారు. మాజీ మంత్రి విడదల రజనీపై, ఆ తర్వాత మాజీ మంత్రి అంబటి రాంబాబుపై హత్యాయత్నం, ఇంటిపై దాడులు చేసి ఆస్తులను ధ్వంసం చేయడం జరిగిందన్నారు. కూటమి సర్కారు వినూత్న రీతిలో సర్కారీ ఆర్గనైజ్డ్ క్రైంకు దారితీసిందన్నారు. సిబిఐ రిపోర్టుతో గత జగన్ ప్రభుత్వం కడిగిన ముత్యంలా బయటపడిందన్నారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం జోగి రమేష్ ఇంటిపై పెట్రోలు బాంబులతో దాడులు చేయడం ఇది కూటమి ప్రభుత్వం యొక్క దౌర్జన్య కాండకు నిదర్శన మన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని, పోలీసులు కూడా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని ఏం చేయాలని డిజిపి అనుకొంటున్నారని అంబటి ప్రశ్నించారు. ఇవే దాడులు రాబోయే రోజుల్లో సామాన్య మానువులపై జరిగితే సామాన్యుల భద్రత పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు.ఇప్పటికైనా కేంద్రం రాష్ట్రంలోని శాంతిభద్రతల విషయంలో కలుగజేసుకొని సామాన్యులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో ఆకుల వెంకటేశ్వరరావు, అంబటి వెంకటేశ్వరావు, బోయిన శివనాగరాజు, ఎందేటి వెంకటసుబ్బయ్య, మూకిరి అనీలకుమారి, షేక్ మహమ్మద్(మాము),వట్టిప్రోలు రంగారావు, చుందూరు వీరయ్య, బలగాని రమేష్ తదితరులున్నారు.

# ఏఐ మోడళ్లు భవిష్యత్తులో సుస్థిర అభివృద్ధికి బలమైన పునాది

**పొన్నూరు, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు తక్కువ ఖర్చుతో, స్వదేశీ అవసరాలకు అనుగుణంగా రూపొందించే ఓపెన్ సోర్స్‌లో రీసోర్స్ ఏఐ మోడళ్లు భవిష్యత్తులో సుస్థిర అభివృద్ధికి బలమైన పునాదిగా మారతాయని స్విసెనెక్స్ ఇన్ ఇండియా కంపెనీ అకడెమిక్ ఎంగేజ్‌మెంట్ హెడ్ లీనా మారైకే జోసెఫిన్ రోబ్రా అన్నారు. చేబ్రోలు మండలం,



వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో కాన్‌క్లేవ్ ఆన్ రెస్పాన్సిబుల్ అండ్ సస్టేనబుల్ ఏఐ అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును బిల్డింగ్ బెటర్ విత్ ఏఐ సస్టేనబిలిటీ యాస్ ఏ బ్లూ ప్రింట్ ఫర్ ఇండియా అనే ఇతివృత్తంతో నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన లీనా మారైకే జోసెఫిన్ రోబ్రా మాట్లాడుతూ సాంకేతికత దేశాభివృద్ధికి అనేక రంగాల్లో ఉపయోగపడుతుందని చెప్పారు. ముఖ్యంగా తక్కువ వనరులతో, తక్కువ ఖర్చుతో రూపొందించే ఏఐ మోడళ్ల ద్వారా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాలకు కూడా ఆధునిక సాంకేతిక సేవలను అందించవచ్చని వివరించారు. ఓపెన్ సోర్స్, లో రీసోర్స్ ఏఐ అనువర్తనాలు వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, పాలన, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలవని చెప్పారు. రైతులకు పంటలపై ముందస్తు అంచనాలు, తెగుళ్ల గుర్తింపు, వాతావరణ సూచనల ద్వారా సరైన నిర్ణయాలు తీసుకునే ఏఐ సహాయపడుతుందన్నారు. విద్యారంగంలో స్థానిక భాషల్లో డిజిటల్ కంటెంట్, ఆటోమేటెడ్ ట్యూటరింగ్, ఆన్‌లైన్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించవచ్చని వివరించారు. పర్యావరణ పరిరక్షణలో అడవుల సంరక్షణ కాలుష్య నియంత్రణ, వాతావరణ మార్పుల విశ్లేషణ వంటి అంశాల్లో కూడా ఈ సాంకేతికత దోహదపడుతుందని చెప్పారు. మరో అతిథి మాజీ ఏసీఎం ఇండియా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ పద్మనాభుని మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో ఏఐ ఆధారిత పంట దిగుబడి అంచనాలు, నేల ఆరోగ్య విశ్లేషణ, వాతావరణ సూచనల ఆధారంగా పంటల ఎంపిక, తెగుళ్ళను ముందుగానే గుర్తించడం వంటి అనువర్తనాలు రైతులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. దీనివల్ల నీరు, ఎరువులు వంటి వనరులను సమర్థవంతంగా వినియోగించ కోవచ్చని పేర్కొన్నారు. అలాగే ఆరోగ్య రంగంలో తక్కువ ఖర్చుతో, వేగంగా నిర్ధరణ చేసే సిస్టమ్స్ ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని వివరించారు. కార్యక్రమంలో బెంగుళూరులోని సీఐఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తన్వీర్ హసన్, అమృత విశ్వ విద్యాపీఠం ప్రొఫెసర్ శ్రీరామ్ దేవనాథన్, ఐఐటీ మద్రాస్ సీఈఆర్ఏఐ ఏఐ పాలసీ హెడ్ డాక్టర్ గీతారాజు, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్స్ ఇంచార్జి వీసి ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ హాస్పిటల్స్,ల్యాబ్‌లు ఆయుష్మాన్ భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోండి

**తెనాలి టౌన్ ఫిబ్రవరి2(ప్రభాతవార్త):** ప్రభుత్వం వారి ఆదేశం మేరకు తెనాలి డివిజన్ లో ఉన్నా ప్రైవేట్ హాస్పిటల్స్, క్లినిక్స్, డిస్పెన్సరీస్, ల్యాబ్ లు, స్కాన్ సెంటర్స్ అన్ని కూడా తప్పనిసరిగా ఏబిడిఎం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ పోర్టల్ నందు నమోదుగు



చేసుకోవాలని సిహెచ్ఎడ్లబ్లియు వారి ఆదేశం, కావున ప్రతి ఒక్కరు వెంటనే స్పందించి ఇంత వరకు ఏబిడిఎం పోర్టల్ నందు నమోదు చేపించు కొని వారు వెంటనే హెచ్పిఆర్ హెల్తకేర్ ప్రొఫెషనల్స్ రిజిస్ట్రీ మరియు హెచ్ఎఫ్ఆర్ హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ నమోదు చేపించు కోవాలని తెనాలి ఉప వైద్య ఆరోగ్య శాఖధికారి(తెనాలి)డా : ఇ. అన్నపూర్ణ తెలిపారు.

# వనితానికేతన్ ద్వారా సేవా కార్యక్రమాలు

**పొన్నూరు, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** వనితా నికేతన్‌ను స్థాపించిన వారిలో ఒకరైన గోమఠం అలివేలు మంగతాయారు(చిట్టెమ్మ) అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎంతో మందికి సేవలందించారని, ఆమె మరణం సేవా లోకానికి తీరని లోటని విశ్వహిందూ పరిషత్ ప్రముఖ్ పరాశరం శేషకుమారి అన్నారు. స్థానిక వనితానికేతన్‌లో సోమవారం జరిగిన సంస్మరణ సభలో ఆమె మాట్లాడారు. అలివేలు మంగ తాయారు అయినప్పటికీ చిట్టెమ్మగానే అందరికీ పరిచయం. ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యదర్శిగా కూడా పనిచేసి తమ సేవలను అందించారన్నారు. చిట్టెమ్మ లేని లోటు తీర్చలేనిదన్నారు. చిట్టెమ్మ ఏ ఆశయంతో అయితే వనితానికేతన్‌ను స్థాపించారో ఆ ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని పలువురు సభ్యులు పిలుపునిచ్చారు. తొలుత చిట్టెమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వనితాని కేతన్, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు కొత్తమాసు పద్మజ, పరాశరం రంగవల్లి, ఆలపాటి శారద, లక్ష్మీకుమారి, దుర్గారాణి తదితరులు చిట్టెమ్మ చేసిన సేవలను కొనియాడారు.




# వేగంగా ఏకీకృత కుటుంబ సర్వే

**పొన్నూరు, ఫిబ్రవరి 2,ప్రభాతవార్త:** అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే(ఏకీకృత కుటుంబ సర్వే) పట్టణంలో వేగంగానే సాగుతోంది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రతి కుటుంబం యొక్క వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, విద్య తదితర(25రకాల అంశాలు) సేకరించి ఒకే డిజిటల్ డేటా బేస్‌గా మార్చేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా పట్టణంలో సచివాలయ సిబ్బంది



ఇంటింటికి తిరిగి వివరాలను సేకరించి సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వే డేటా ఆధారంగా ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ బెనిఫిట్ కార్డులను జారీ చేయడం జరుగుతుందని పలువురు అధికారులు చెప్తున్నారు. సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు పారదర్శకంగా త్వరగా అందేలా చేయడమే ఈ సర్వే ఉద్దేశమని పలువురు అధికారులు చెప్తున్నారు.

# అవగాహన..లో డిక్సన్ అవార్డు గ్రహీత డాక్టర్ సురేష్‌కుమార్‌కు సత్కారం

**గుంటూరు కల్చరల్,ఫిబ్రవరి 2,ప్రభాతవార్త :** ఆంగ్ల కవితల పుస్తకం ఇన్నర్ ఫీలింగ్స్ ఆఫ్ ఏ సైక్రియాట్రిస్ట్ కి ప్రతిష్టాత్మక డిక్సన్ అవార్డు పొందిన ప్రముఖ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ కె.సురేష్‌కుమార్,ఆయన సతీమణి రామలక్ష్మిని స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో అవగాహన ఆరోగ్యసభ బృంద సభ్యులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ అవగాహన సంస్థకు అప్పుడు సంస్థ జీవిత సభ్యుడు డాక్టర్ సురేష్‌కుమార్ ప్రసిద్ధ ఇంగ్లీషు రచయిత డిక్సన్ పేరుమీద ఏర్పాటు చేసిన అవార్డు రావడం గొప్ప విషయమన్నారు.కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌కుమార్ ప్రసంగిస్తూ తనకు మానసిక వైద్యునిగా ఎదురైన అనేక సంఘటనలను,రోగులను దృష్టిలో ఉంచుకొని ఈ కవితల పుస్తకాన్ని రూపొందించానన్నారు. అవగాహన సంస్థ అంటే తనకు అభిమానమని ఆ సంస్థ తనను సత్కరించడాన్ని గొప్ప విషయంగా భావిస్తున్నానన్నారు.

# ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**కొల్లూరు, ఫిబ్రవరి 2 (ప్రభాతవార్త) :** ప్రభుత్వ సచివాలయాల్లో పాఠశాలల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపీడీవో సుశీలత అన్నారు. సోమవారం కొల్లూరు 3 సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రానికి ఆకస్మిక తనిఖీ



చేశారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ ప్రజలకు ఆధార సేవలు అందించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసింది అన్నారు. 17 సంవత్సరాల పిల్లల ఆధార్ కార్డులను అప్డేట్ చేసుకోవాలన్నారు. అదే విధంగా ఆధార్ కార్డులో చిరునామాల మార్పు పుట్టిన తేదీ తదితర సేవలను ప్రజలందరూ పొందవచ్చు అన్నారు. కొన్ని సేవలను ఉచితంగా మరియు కొన్ని సేవలను నామమాత్రపు రుసుముతో మార్పులు చేర్పులు చేసుకోవచ్చు అన్నారు. మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 3వ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసేది చిత్రకళే

## -బెల్లంకొండ వెంకట్

**తెనాలి టౌన్ ఫిబ్రవరి2(ప్రభాతవార్త):** ఫిబ్రవరి 2 వరల్డ్ "వెట్లాండ్స్ డే"( చిత్తడి నేలలు) సందర్భంగా,పట్టణంలోని మారీస్ పేట లోగల, నల్లమోతు చెంచు రామానాయుడు మున్సిపల్ హైస్కూల్ నందు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.సమగ్ర శిక్ష ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు



(చిత్తడి నేలలు) అంశంపై చిత్రలేఖనం పోటీలను, చిత్రలేఖనోపాధ్యాయులు బెల్లంకొండ వెంకట్ నిర్వహించారు.ఈ సందర్భంగా,విద్యార్థులు సృజనాత్మకతతో పెయింటింగ్ ద్వారా చాలా చక్కగా గీశారు.వన్య ప్రాణుల రక్షణ, కాలుష్య నివారణ, వరదలను నియంత్రించడం, వలసపక్షుల నిలయాలు వివిధ రకాలుగా చాలా చక్కగా చిత్రీకరించారు.చిత్రలేఖన పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థిని,విద్యార్థులను ఇంచార్జ్ హెచ్ఎం సోమశేఖర్, సిఆర్పి శ్రీదేవినీ,చిత్రలేఖన ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్ ను అభినందించారు.

# ఏఈఎల్సి వ్యవస్థాపకులు రెవ.జాన్ క్రిస్టియన్ ఫైబర్ విగ్రహం తయారీ

**తెనాలి టౌన్ ఫిబ్రవరి2(ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ లో ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ సంఘం వ్యవస్థాపకులు రెవరెండ్.జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్ ఫైబర్ గ్లాస్ విగ్రహాన్ని, పట్టణంలోని సూర్య శిల్పశాలలో రూపుదిద్దుకుంది.1842వ సంవత్సరంలో అమెరికా నుంచి గుంటూరుకు వచ్చి, ఆంధ్రప్రదేశ్‌లో లూథరన్ మిషన్ సేవలకు పునాదివేసి ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ సంఘాన్ని స్థాపించిన రెవరెండ్.జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్ ఫైబర్ గ్లాస్ విగ్రహన్ని తయారుచేయటం చాలా ఆనందంగా ఉందని,ఈ విగ్రహాన్ని గుంటూరు లో కన్నవారి తోటలోని లూథరన్ ప్రేయర్ హాల్ ప్రాంగణంలో ప్రతిష్ఠించనున్నట్లు శిల్పులు, ఆంధ్ర శ్రీ,కళారత్న కాటూరి వెంకటేశ్వరరావు మరియు రవిచంద్ర లు తెలిపారు.ఈ చర్చిలో గతంలో తాము తయారు చేసిన మార్టిన్ లూథర్ విగ్రహం ఇప్పటికే ప్రతిష్ఠితమై ఉందని, అదే విగ్రహం పక్కనే



ఇప్పుడు ఫాదర్ హయ్యర్ విగ్రహాన్ని కూడా ఆవిష్కరించనున్నట్లు చర్చ్ వ్యవస్థాపకులు మంచాల జయరావు, తెలిపినట్లు శిల్పులు పేర్కొన్నారు.

# పురపాలకసంఘ కార్యాలయంలో గ్రీవెన్స్

**తెనాలి మున్సిపాలిటీ ఫిబ్రవరి2(ప్రభాతవార్త):** ప్రభుత్వ ఆదేశానుసారం ప్రతి సోమవారం నిర్వహించే,ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పిజీఆర్ఎస్ ) గ్రీవెన్స్ కార్యక్రమాన్ని, మున్సిపల్ హెల్త్ అఫిసర్ ఎం. ఏసుబాబు పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,వచ్చిన అర్జీలను సంబంధిత విభాగాధిపతులకు పంపి తగిన చర్యలు తీసుకోవలసిందిగా ఆదేశిస్తామన్నారు.వచ్చిన అర్జీల్లో ముఖ్యంగా,టౌన్ ప్లానింగ్ విభాగానికి ఐతానగర్ నుండి రమాదేవి, సుధాకర్ లు టిడ్కో గృహాలు గురించి,అలాగే ఇంజనీరింగ్ విభాగానికి,దూళ్ల అప్పయ్య భవనము రోడ్డు నందు సి.సి. రోడ్డు మరియు డ్రైయిన్ నిర్మాణము చేయాలని,అదే విధంగా ఇందిరానగర్ కాలనీ, చెంచుపేట నందు సి.సి.రోడ్డు నిర్మాణము చేయవలసినదిగా అర్జీలు వచ్చినట్టు, పురపాలక సంఘ అధికారులు తెలిపారు.



# ఆంధ్ర ప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ నూతన కార్యవర్గం

**గుంటూరు విద్య ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా విశ్రాంత అధికారి అంబడిపూడి శంకర్రావు, అధ్యక్షులుగా ఎస్. రాజారావు, అసోసియేట్ అధ్యక్షులుగా కంచర్ల నాగేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా వీసా డేవిడ్ రాజు, మహిళా సెక్రెటరీగా ఎం అమల జ్యోతి, ట్రెజరర్ గా జి శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్ క్రాంతి కుమార్, ఉపాధ్యాక్షులుగా కంచి నాగేశ్వరరావు, తుర్ల రాజేష్, పి బాబురావు, జంగం శ్యామ్, వలపర్ల వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రెటరీగా బత్తుల శివశంకరరావు, పాముల ప్రసాద్, మార్పు జగదీష్ బాబు ,బండికళ్ళ సతీష్, కె వీరకుమార్ లు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. వీరి కార్యవర్గం ఎన్నికైన తేదీ నుండి మూడు సంవత్సరాల పాటు ఫోర్సులో ఉంటుందని పేర్కొన్నారు.

# మైనారిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**గుంటూరు విద్య ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** ఆల్ మైనారిటీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రచురించిన 2026 డైరీ ని గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ సోమవారం ఉదయం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సంఘ ప్రతినిధులతో మాట్లాడుతూ మైనార్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి తాను ఎప్పుడు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎలాంటి ఇబ్బందులు ఉన్న తన దృష్టికి తీసుకురావచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ జానీబాషా, గుంటూరు జిల్లా అధ్యక్షులు కార్పొరేషన్ బాషా షేక్, రిటైర్డ్ ఆర్డీవో షేక్ ఇస్మాయిల్, రిటైర్డ్ మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ మస్తాన్ షరీఫ్, గఫార్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ పథకం అండగా నిలుస్తుంది

## ఎమ్మెల్యే రామాంజనేయులు

వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త : నిరుపేదల వైద్యం ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) పథకం ఆర్థికంగా అండగా నిలుస్తుందని ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు.ప్రత్తిపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది .ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు రామాంజనేయులు పాల్గొని మాట్లాడుతూ..దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసే ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని పట్టు చెరుకూరు ప్రత్తిపాడు కాకుమాను పెదనందిపాడు గుంటూరు రూరల్ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన నిరుపేదలైన వారి ఆరోగ్య ఖర్చులకు రూ.1.17 కోట్ల విలువగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను 89మందికి అందజేయడం జరిగిందన్నారు.ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు,ఆర్థికంగా వెనుకబడినవారు



ఎదుర్కొనే తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు, అకస్మాత్తు ప్రమాదాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిధి అన్నారు. గడిచిన 18 నెలల కాలంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని లబ్ధిదారులకు 24 సార్లు రూ.తొమ్మిది కోట్ల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కులను 782 మందికి అందించామని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులతో పాటు రూ.81లక్షల విలువ ఎల్ఓసీ చెక్కులను 41 మందికి మరియు రూ.36 లక్షల విలువ గల రియంబర్స్మెంట్ చెక్కులను 48 మందికి అందించినట్లు వివరించారు. ఈ ఆర్థిక సహాయంతో వారి కుటుంబాలకు ఎంతో ఆనందాన్నీ మరియు చేయూతను అందిస్తుందని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ వర్తించని వారికి కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన వారందరికీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుతున్నాయని, దీంతో నిరుపేద మధ్యతరగతి వర్గాల వారు సంతోషంగా ఉంటున్నారని వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్పొరేటర్లు, మండల పార్టీ అధ్యక్షులు, లబ్ధిదారులు, డివిజన్ పార్టీ అధ్యక్షులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# అధ్యాపకులు బోధన, సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

**వట్టిచెరుకూరు, ఫిబ్రవరి 2, ప్రభాతవార్త :** అధ్యాపకులు విషయ పరిజ్ఞానం, బోధన, సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని టిఎఫ్ఐకి చెందిన హైదరాబాద్ ఐఐటి రీసెర్చ్ ఇంటర్న్, ఏఐ మరియు ఎంఎల్ ఎడ్యుకేటర్ హర్షవర్ధన్ వైద్యనాథన్ పేర్కొన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామం వద్దనున్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్స్ విభాగం మరియు టిఎఫ్ఐ సెల్ ఆధ్వర్యంలో



అధ్యాపకులకు ఏఐ ఏజెంట్ ఇన్ యాక్షన్, డిజైన్, డెసిషన్ మేకింగ్ అండ్ డిప్లాయిమెంట్ పై వారం రోజుల ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిఎఫ్ఐ కి చెందిన హర్షవర్ధన్ వైద్యనాథన్ హాజరై మాట్లాడుతూ..ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్.డి.పి) అనేది ఒక సంస్థలోని బోధనా సిబ్బంది నైపుణ్యాలు, సామర్థ్యాలు మరియు అభివృద్ధిని పెంపొందించడానికి రూపొందించబడిందన్నారు. అధ్యాపక సభ్యులు బోధనా శాస్త్రం, సాంకేతికత మరియు విద్యా నిర్వహణలో తాజా ధోరణులతో విద్యా అనుభవాన్ని మెరుగుపరచడమే దీని ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. అధ్యాపకులకు కృత్రిమ మేధస్సు అనేది మనిషి మేధస్సును అనుకరించే విధంగా వ్యవస్థలను రూపొందించడంపై దృష్టి సారించిన విస్తృత రంగం అన్నారు. ఇది క్లిష్ట సమస్యలను పరిష్కరించటం కోసం ఉపయోగించబడుతుందని చెప్పారు. మెషిన్ లెర్నింగ్ అనేది ఏఐ లోని ఒక ఉప శాఖ అని, ఇది డేటా నుండి నేర్చుకోవడం, నమూనాలను గుర్తించడం మరియు స్పష్టమైన ప్రోగ్రామింగ్ లేకుండానే కాలక్రమేణా పనితీరును మెరుగుపరుచుకునే సామర్థ్యాన్ని వ్యవస్థలకు అందిస్తుందని వివరించారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కీలక భాగాలలో అధ్యాపక పనితీరు మరియు పనిభారాన్ని అంచనా వేయడానికి ఒక వ్యవస్థను ఏర్పాటు చేయడం . బోధనా గంటల పంపిణీ , పరిశోధన బాధ్యతలు మరియు పరిపాలనా పనులను విశ్లేషించే లోడ్ మ్యాట్రిక్స్ ద్వారా దీనిని సాధించవచ్చని, అదనంగా క్రమం తప్పకుండా నాణ్యత, బోధనా ప్రభావాన్ని అంచనా వేయడానికి, విద్యార్థుల అభిప్రాయాన్ని సేకరించడానికి మరియు అధ్యాపక నిశ్చితార్థాన్ని అంచనా వేయడానికి సంస్థలను అనుమతిస్తాయని వివరించారు. నిరంతర అభ్యాసం ఈ కార్యక్రమంలో కీలకమైన అంశమని, అధ్యాపక సభ్యులు బోధనా నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవడానికి వర్క్‌షాప్‌లు, సెమినార్లు, సమావేశాలు మరియు ఆన్‌లైన్ కోర్సులలో పాల్గొనమని ప్రోత్సహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ఆధునిక బోధనా పద్ధతులు, సాంకేతికతలు, తాజాగా ఉండేలా చూసుకోవడం ద్వారా విద్యావేత్తల బోధన నైపుణ్యాలను పెంపొందించడంలో ఎఫ్డిపీలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఈ విధానం విద్య నాణ్యతను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుందని, ఇది ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా ఉంటుందని తెలియజేశారు. అధ్యాపకులు ఇలాంటి కార్యక్రమాలను ఉపయోగించు కొని నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ పి. బాబు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, సిఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.రమేష్, ఐఐసి సెల్ ప్రెసిడెంట్ డాక్టర్ సిహెచ్.అరుణ, వివిధ విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఆర్‌విఆర్‌జెసి ఇంజనీరింగ్ కళాశాలలో "రోడ్ ఇంజనీరింగ్ నేషన్ బిల్డింగ్" అంశం పై సెమినార్

**గుంటూరు విద్య ఫిబ్రవరి 2 ప్రభాతవార్త :** ప్రజల భద్రతకు పూర్తి భరోసా కల్పించే విధంగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక రహదారుల నిర్మాణానికి ఇంజనీరింగ్ విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేయాలని విఁగి ఎన్ ఐ టి ప్రొఫెసర్ డా.ఎస్. శంకర్ పేర్కొన్నారు. స్థానిక చౌడవరంలోని ఆర్.వి.ఆర్ జె.సి. ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం అద్వర్యంలో"క్లాస్ రూమ్ టు హైవేస్ : కెరీర్స్, ఎథిక్స్ అండ్ నేషన్ బిల్డింగ్ త్రూ రోడ్ ఇంజనీరింగ్" అంశం పై నిర్వహించిన



సెమినార్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరై, గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేలు, గ్రీన్ టెక్నాలజీ, స్మార్ట్ రోడ్ల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా డా.ఎస్. శంకర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రోడ్డు నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ నిలిచిందని, రీసైకిల్ చేసిన ప్లాస్టిక్, జియో-సింథటిక్స్ వినియోగంతో పాటు డ్రోన్లు, లైదీతిళి, డిజిటల్ ట్విన్స్ వంటి ఆధునిక సాంకేతికతలు రహదారుల నిర్మాణ నాణ్యతను గణనీయంగా పెంచుతున్నాయని తెలిపారు. నేటి వేగవంతమైన ప్రపంచంలో రహదారులు దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాణనాడులుగా నిలుస్తున్నాయని, ఇంజనీరింగ్ విద్యార్థులే దేశ నిర్మాణ శిల్పులని కళాశాల అధ్యక్షులు డా. రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు శ్రీ జాగర్లమూడి మురళీమోహన్ మరియు డా. జగదీష్ కె. మద్దినేని పేర్కొన్నారు.2047"వికసిత్ భారత్" లక్ష్యంలో భాగంగా పల్లెల నుంచి పట్టణాల వరకు నాణ్యమైన రహదారుల నిర్మాణంపై దేశం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదని, అందులో ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సాంకేతిక పరిజ్ఞానం, నైతిక విలువలతో భాగస్వాములవ్వాలని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ శ్రీ రాయపాటి గోపాల కృష్ణ, ట్రెజరర్ డా. కొండబోలు కృష్ణ ప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ డీ డైరెక్టర్ డా. కె. రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అడ్మినిస్ట్రేషన్ డా. ఎన్.వి. శ్రీనివాస రావు, డా. ఏ. శ్రీనివాస ప్రసాద్, డా. పి. సమతా చౌదరి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పరిశోధనల్లో నవ్యతా,నాణ్యత ఉండాలి

## రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఫిబ్రవరి2, ప్రభాతవార్త:** సమాజాన్ని అభివృద్ధి పరచే పరిశోధనలపై పరిశోధకులు దృష్టి సారించాలని ఏఎన్‌యు రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం అన్నారు. ఏఎన్‌యులోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ ఆన్ రైటింగ్ రీసెర్చ్ ఆర్టికల్స్ అనే అంశంపై రెండు రోజుల కార్యశాల సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి డా.అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య



వై.అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ సింహాచలం మాట్లాడుతూ పరిశోధనల్లో నవ్యత, నాణ్యత ఉండాలన్నారు. అలాగే పరిశోధనాంశాలపై రాసే ఆర్టికల్స్ కూడా కంటెంట్‌తో కూడుకున్నదై ఉంటేనే వాటిని గుర్తింపు వస్తుందని చెప్పారు. అవసరం, ప్రాధాన్యలతను పరిగణలోకి తీసుకుంటే మంచి పశోధనలు వస్తాయన్నారు. వాటి ఫలాలు సమాజాభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. ఎస్‌కెడి యూనివర్సిటీ నుంచి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న సోషల్‌వర్క్ విభాగాధిపతి ఆచార్య ఎం.మునినారాయణప్ప మాట్లాడుతూ పరిశోధనల్లో కమిట్మెంట్ ఉండాలన్నారు. తద్వారా ఉత్తమ పరిశోధనలు వస్తాయని పేర్కొన్నారు. ఇదే యూనివర్సిటీకి చెందిన ఆచార్య జి.వి.రమణ మాట్లాడుతూ పరిశోధన అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. కొన్ని పరిశోధనలు కాలానుగుణంగా మార్పులను తీసుకొస్తాయని, మరికొన్ని శాస్త్రీయతను చూపుతాయన్నారు. ఏఎన్‌యు రూరల్ డెవలప్‌మెంట్ ఆచార్యులు, దూరవిద్య పరీక్షల మాజీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.సోమశేఖర్ మాట్లాడుతూ పరిశోధనల ద్వారామార్పులు ఎలా వస్తాయో వివరించారు. ఆనాడు డా. బి.అంబేద్కర్ రాసిన పరిశోధన గ్రంథం వాల్యూ ఆఫ్ రూపీ ఆధారంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నేడు ఆర్‌బిఐ వ్యవస్థ దేశంలో ఏస్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ప్రతీ పరిశోధనలో ఉపయోగపడే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ముఖ్యంగా పరిశోధకులు భాషా నైపుణ్యాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భావ వ్యక్తీకరణ, ఇన్నోవేటివ్ ఆలోచనలు పాటించి, మెలకువలు నేర్చుకుంటే నిరంతరం శ్రమిస్తే ఉన్నతమైన పరిశోధనలు వస్తాయన్నారు. ఆచార్య అశోక్‌కుమార్ మాట్లాడుతూ డా. అంబేద్కర్ చైర్ రెండు రోజుల ఈ కార్యశాల ద్వారా నూతన పరిశోధకులు పరిశోధనా పత్రాలు రాయడం, థీసిస్‌కు సరిపడ రిఫరెన్స్, రివ్యూలను సులభంగా సేకరించే అవకాశం ఉంటుందన్నారు. అంబేద్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అబ్రహం లింకన్ మాట్లాడుతూ ఇటువంటి పరిశోధనా కార్యశాలలు రానున్న రోజుల్లో ఎక్కువగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యశాలలో చైర్ సిబ్బంది డాక్టర్ వి.శ్రీనివాస్, ఎన్.అబ్రహాం, పరిశోధకులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృధికి,సంక్షేమ కార్యక్రమాలకు చంద్రబాబు గాడ్ ఫాదర్ డేగల ప్రభాకం

**గుంటూరు వెస్ట్, ఫిబ్రవరి 1,ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైసీపీ కుట్రలు ఇంకా కొనసాగావని ఇప్పటికైనా మార్పు తెచ్చుకోవలని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డేగల



ప్రభాకర్ హితావు పలికారు.ఆదివారం జిల్లా టిడిపి కార్యాలయంలో చైర్మన్ డేగల ప్రభాకర్ మాట్లాడుతూ అంబటి రాంబాబు నోటి దురుసు ప్రవర్తన వల్ల అతని పాపం పడిపోయి ందన్నారు.పెద్దనాయకుడు అని చెప్పుకునే అంబటి ముఖ్యమంత్రి పై ఇలా మాట్లాడం సంస్కారమేనా అని ప్రశ్నించా రు.అంబటి మాట్లాడిన మాటలకు కుక్కను కొట్టినట్లు కొట్టాలని మండిపడ్డారు. ఏదోరకంగా మీడియాలో కనపడాలని ముఖ్య ఉద్దేశంతో అంబటి ఇలాంటి నీచమైన మాటలు మాట్లాడు తున్నారని ఎద్దేవా చేశారు.జగన్ సతీమణిపై టీడీపీ సానుభూతిపరుడు అనుచిత వ్యాఖ్యలు చేస్తే, దానిపై సీఎం గారు అతన్ని అరెస్టు చేయించి జైల్లో పెట్టించారన్నారు.మరి నేడు అబంటి బూతులపై అతనిపై జగన్ చర్యలు తీసుకుంటారా..? లేక వెంటనే ప్రజలకు క్షేమాపణ చెబుతారా. .రాష్ట్రంలో శాంతిభద్రతలు విచ్చిన్నం చేసేందుకే వైసీపీ సైకోలు చేత రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయిస్తున్నారు. రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం, కానీ మాజీ మంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని ఉద్దేశించి ఉపయోగించిన భాష అత్యంత హేయమైనది.అంబటి కాపు కులం అని వైసిపి కి ఇప్పటికి గుర్తొచ్చినట్లు ఉందని ఏద్దేవా చేశారు.అంబటి నోటి దూలను కుల రుద్దొద్దు అని హెచ్చరించారు .కులాలలు, మతాలను అడ్డుపెట్టుకొని వైసిపి రాజకీయ లబ్ది పొందటానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు పై వైసీపీ నేతలు ఎవ్వరు మాట్లాడినా చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

# తెనాలి కీర్తి కిరీటంలో మరో మణిహారం ఆయుష్ హాస్పిటల్ : రత్నాకరశాస్త్రీ

**తెనాలి టౌన్ ఫిబ్రవరి2(ప్రభాతవార్త):** అభివృద్ధి ప్రదాత, రాజకీయాలకతీతంగా నిరంతరం అభివృద్ధి కోసం పాటుపడే, తెనాలి శాసనసభ్యులు, రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్ కృషి ఫలితంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, ఐదు ఆయుష్ హాస్పిటల్స్ కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయడం జరిగింది, అందులో ఒక హాస్పటల్ మన తెనాలికి రావటం మనోహర్ ముందుచూపుకు నిదర్శనమని, ఈ ప్రాంత ప్రజల మీద, ఆయనకున్న అభిమానానికి మచ్చుతునక అని రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ మాగంటి రత్నాకరశాస్త్రీ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయుష్ అంటే ఏ.ఆయుర్వేదం, వై.యోగ, యు.యునాని, ఎస్ సిద్ధ వైద్యం, హెచ్ హోమియోపతి, అని అన్నారు. ఈ ఐదు రంగాల్లో, నిష్ణాతులైన మన తెనాలి పెద్దలందరితో, మన మంత్రి గారిని కలిసి అభినందన కార్యక్రమం ఏర్పాటు చేయ నున్నట్లు శాస్త్రీ తెలియజేశారు. సిద్ధ వైద్యంలో, ఆయుర్వేద వైద్యంలో, మన తెనాలి గుడివాడ హనుమంతరావు చేసిన కృషి మరువలేనిదని శాస్త్రీ అన్నారు, అదేవిధంగా, కావూరి వినయాశ్రమములో, డాక్టర్ గొల్లపూడి ప్రకాష్ చేస్తున్న కృషిని కొనియాడారు. జీవితంలో మనం ఏది స్వీకరించిన దాన్ని వదిలివేయటమే అసలైన యోగాఅని , పీల్చిన గాలిని త్రాగిన నీరుని తీసుకున్న ఆహారాన్ని, ఆయా సమయాలను బట్టి వదిలేస్తున్నామని, కానీ, మనలోని రాగద్వేషాలు వదిలేయకపోతున్నామని, దీనికి యోగ ఎంతగానో ఉపయోగపడుతుందని, రత్నాకర్ శాస్త్రీ అన్నారు. ఆయుర్వేద పితామహులైన,ధన్వంతరి చరకుడు సుశ్రుతుడు, చ్యవనుడు, నాగార్జునుడు, ఇలా ఎందరో ప్రాతః స్మరనీయులని స్మరించుకోవడం, మన తెనాలికి మనోహర్ ద్వారా మనకి లభించిన అదృష్టంగా శాస్త్రీ తెలియజేశారు. కార్పొరేట్ వైద్యం గగన కుసుమయమైన నేటి రోజుల్లో, ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా, అందరికీ అందుబాటులో ఉండే, ఆయుర్వేద హోమియోపతి వైద్యాలు, మన తెనాలి నియోజకవర్గ ప్రజలకే కాకుండా, పరిసర గ్రామ ప్రజలందరికీ కూడా, రాబోయే రోజుల్లో ఒక వరంగా, ఈ ఆయుష్ హాస్పిటల్ ఉండబోతుంది అనటం ఎటువంటి సందేహము లేదని రత్నాకర్‌శాస్త్రీ తెలియజేశారు. ఈ అద్భుతమైన ఆయుష్ హాస్పిటల్, రాష్ట్రానికి ఐదు లభిస్తే, అందులో తెనాలికి ఒకటి శాంక్షన్ చేసి, 23 కోట్ల రూపాయలు తీసుకువచ్చి, అత్యంత వైభవంగా ఈ హాస్పిటల్ రూపొందిస్తున్న, మనోహర్ ని ప్రతి ఒక్కరము రాజకీయాలకు అతీతంగా అభినందించాలని శాస్త్రీ కోరారు. ఈ హాస్పిటల్ కి అనుబంధంగా, ఒక ఆయుర్వేద వైద్య కళాశాల కూడా ఏర్పాటు చేయనున్నట్లు శాస్త్రీ తెలియజేశారు. తెనాలి ప్రాంతానికి ఈ ఆయుర్వేద వైద్య కళాశాల, అనేక పరిశోధనలకు వేదిక కానున్నది అని చెప్పి శాస్త్రీ తెలియజేశారు. చిన్నపిల్లలకి, మహిళలకు, వృద్ధులకు, అత్యంత సౌకర్యవంతమైన, హోమియో వైద్యాన్ని, ఈ హాస్పిటల్ లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు శాస్త్రీ తెలియజేశారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ ముందుచూపుతో, కార్పొరేట్ వైద్య విధానాలకి, ఆర్థికంగా వెనుకబడిన వారు, తమ ఆరోగ్యాన్ని ఈ ఆయుష్ హాస్పిటల్ ద్వారా మెరుగుపరుచుకోవడం ఎంతైనా అవసరం ఉందని చెప్పి శాస్త్రీ కోరారు. తెనాలికి ఆయుష్ హాస్పిటల్ ఏర్పాటుకు కారణభూతులైన మంత్రి మనోహర్ తెనాలి రాజకీయ చరిత్రలో తనకంటూ ఒక పేజీ లిఖించు కున్నారని చెప్పి శాస్త్రీ కొనియాడారు . ఈ సందర్భంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ కి, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రేపు జరగబోయే, అందత్వ నివారణలో, గవర్నమెంట్ స్కూల్లో విద్యనభ్యసిస్తున్న, విద్యార్థినీ విద్యార్థులకు, కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత కళ్ళజోళ్ళు అందజేస్తున్న కార్యక్రమానికి రాష్ట్ర ఆరోగ్య శాఖ మాత్యులు సత్య కుమార్ గారి విచ్చేయుచున్నట్లు, తెనాలి మార్కెట్ యార్డ్ చైర్మన్, తోట దుర్గా తెలియజేశారు. సత్య కుమార్ కి ఘన స్వాగతం పలికేందుకు, జనసేన శ్రేణులు, కార్యకర్తలు, వీర మహిళలు, బీసీ సోదరులు, యాదవ సంఘాల వారందరూ కూడా పాల్గొనవలసిందిగా తోట దుర్గ కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, తెనాలి పెన్షన్స్ అసోసియేషన్ సభ్యులు అయిన లక్కరాజు లక్ష్మణరావు మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన ఆలోచనలు, ఆరోగ్యవంతమైన శరీరము, ఆరోగ్యవంతమైన సమాజము, ఏర్పడటానికి, ఆధారమైన ఆయుష్ హాస్పటల్ తెనాలికి తీసుకువచ్చిన మంత్రి నాదెండ్ల మనోహర్ ని ఆరోగ్య ప్రదాతక అభివర్ణించారు. రాజకీయాల్లో అజాతశత్రువుగా పేరు తెచ్చుకున్న మనోహర్ రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తున్నందుకు, మనందరం కూడా స్వాగతించాలని చెప్పి లక్ష్మణరావు కోరారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ మాగంటి రత్నాకర్ శాస్త్రీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తోటదుర్గ, లక్ష్మీ వాచ్ కంపెనీ అధినేత అద్దేపల్లి మాధవశాస్త్రీ చెన్నప్రగాఢ శ్రీనివాస్ ప్రభృతులు పాల్గొన్నారు.



